
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 18.09.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 16 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



# ఈ నగరానికి ఏమైంది...?




ఎటు చూసినా గుంతల రోడ్లు, దుర్గంధ భూయిష్టమైన పరిసరాలు, కోకొల్లలుగా అక్రమ కట్టడాలు, బురద గుంటలుగా మారి పందులకు నివాసంగా దర్శనమిస్తున్న ఖాళీ స్థలాలు, కోట్ల కొద్దీ దోమలు, వందలకొద్దీ కుక్కలు, పశువులు, విచ్చలవిడిగా రోడ్డు ఆక్రమణలు, అస్తవ్యస్తంగా రోడ్డుకు అడ్డంగా వాహన పార్కింగ్‌లు, నడిరోడ్లపై మూత్ర విసర్జనలు, వెలిగీ వెలగని వీధి లైట్లు, ఎటుచూసినా గోడలపై వాల్‌పోస్టర్లు, అడ్డదిడ్డంగా వేలకొద్దీ ఆటోలు... వీటన్నిటికీ తోడుగా అటు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖకీ ఇటు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖకీ చెందిన ఇద్దరూ జిల్లాకి చెందిన మంత్రులూ. వీరి పాలనలో నిలువెత్తు నిర్లక్ష్యానికి సాక్ష్యాలుగా మునిసిపల్ శాఖాధికారులు... ఈ నగరానికి ఏమయింది..? శని పట్టిందా...??

(మిగతా 11వ పేజీలో)





# హాస్టళ్ళలో అవినీతి హాల్ట్

పిల్లి గుడ్డిదైతే... ఎలుక డ్యాన్స్ చేసినట్లు... నిఘా అధికారుల తనిఖీలు నామమాత్రమైతే... దోచుకుతినేవాళ్ల సంగతి వేరే చెప్పాలా. పేద విద్యార్థులకు పెట్టే తిండిని సైతం బకాసురుల్లా ఆరగించేస్తున్నారు. కొత్తగా ఛార్జి తీసుకున్న ఎసిబి డిఎస్పీ ప్రభాకర్ నెల్లూరుజిల్లాలో వుండే బకాసురుల భరతం పట్టేందుకు నడుం బిగించారు. 12వ తేదీ రాత్రి నెల్లూరుజిల్లా కొండాపురం మండలం కేంద్రంలోని బిసి, ఎస్సీ హాస్టళ్లపై మెరుపుదాడి చేసారు. డిఎస్పీ తోట ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి రెండు టీంలుగా విడిపోయి రెండు హాస్టళ్లను తనిఖీ చేసారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, లేదా అని విద్యార్థుల నుండి సమాచారం సేకరించారు. బియ్యం, పప్పుల రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతిరోజూ హాస్టళ్లకు గుడ్లు, పండ్లు తెచ్చే వ్యాపారస్తులను విచారించారు.

అనంతరం డిఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ కొండాపురం హాస్టళ్లలో వార్డెన్లు సక్రమంగా విధులకు రావడం లేదని, విద్యార్థులకు ఆహారం పెట్టడం లేదని సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీకి వచ్చే సమయానికి ఇద్దరు వార్డెన్లు లేరన్నారు. రిజిష్టర్‌లో 129మంది విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేసారని, అక్కడ 74మంది మాత్రమే ఉన్నారన్నారు. మిగిలిన విద్యార్థుల భోజనం వార్డెన్ బొక్కేశారని మండిపడ్డారు. ప్రతి రోజూ 6డజన్ల అరటిపండ్లు, 65గుడ్లు తెస్తున్నట్లు లెక్కల పుస్తకాలు వున్నాయని, రోజూ 70మంది విద్యార్థులకు అన్నం పెడుతూ 129మందికి బిల్లులు డ్రా చేస్తున్నారని తెలిపారు.

ప్రతిరోజూ 16కేజీల బియ్యాన్ని వండుతున్నట్లు విద్యార్థులు చెబుతుంటే వార్డెన్ లెక్కల్లో మాత్రం 50కేజీల బియ్యాన్ని వండుతున్నట్లు నమోదు చేసారని వివరించారు. రిజిష్టర్‌లో 113మందికిగాను 58 మంది మాత్రమే హాస్టల్‌లో ఉన్నారని తెలిపారు. ఎస్సీ హాస్టళ్లలో ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు 12సార్లు మాత్రమే తమకు గుడ్లు పెట్టినట్లు విద్యార్థులు చెప్పారు. విద్యార్థులకు మరుగుదొడ్లు లేవని, జిల్లా అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ హాస్టళ్లు, వార్డెన్లు ఇలా తయారయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్లు ఇచ్చే కమిషన్లు తీసుకుని హాస్టళ్లను గాలికి వదిలేశారన్నారు. అనంతరం విద్యార్థుల వద్ద స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మినీ ఫిషింగ్ హార్బర్ కోసం భూగర్భ పరీక్షలు

నెల్లూరుజిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె సమీపంలో మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగే ప్రాంతంలో భూగర్భ పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. హార్బర్ నిర్మాణ ప్రాంతంలో భూగర్భ స్థితిగతులు, మట్టి సామర్థ్యం తెలుసుకునేందుకు ఈ నెల 3న బెంగుళూరు నుంచి వచ్చిన ప్రత్యేక కోస్టల్ ఇంజనీరింగ్ అధికారుల బృందం అత్యాధునిక పరికరాలు, వివిధ యంత్రాల సాయంతో 11వ తేదీ సబ్‌సాయిల్ టెస్ట్ నిర్వహించింది. దాదాపు 11ఎకరాల విస్తీర్ణంతో 20మీటర్ల లోతు వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే సోషియో ఎకనమికల్, హైడ్రో గ్రాఫికల్ పరీక్షలు పూర్తైన క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న సబ్‌సాయిల్ టెస్ట్‌లు కూడా పూర్తయితే హార్బర్ నిర్మాణానికి సంబంధించి డిజైన్ రూపకల్పన ప్రారంభమవుతుంది. డిజైన్ పూర్తయితే పూర్తి స్థాయిలో హార్బర్ పనులు ప్రారంభించే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

## ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ పథకాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్దిదారుడికి అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు డిజిఏఆర్ అనూరాధ అధికారులకు సూచించారు. నెల్లూరులోని విజిలెన్స్ కార్యాలయంలో 11వ తేదీ ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ విజిలెన్స్ అధికారుల దాడుల్లో లోపాలను గుర్తించాలన్నారు. ఇప్పటివరకు చేసిన దాడులు సంక్షేమ పథకాల అమల్లో గుర్తించిన లోపాలపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేష్‌య్య, డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, సిఐలు సత్యనారాయణ, శ్రీనివాసరావు, సంగమేశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్ జయకోమలేశ్వరి, డిఇ సుధాకర్‌రెడ్డి, ఏవో ధనుంజయరెడ్డి, డిసిటిఓ రవికుమార్, ఏజి(మైన్స్) రాము, అటవీ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈ భాష, కో-ఆపరేటివ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కండలేరు జలాశయాన్ని పరిశీలించిన టిటిడి ఛైర్మెన్

నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని కండలేరు జలాశయాన్ని ఆదివారం టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి పరిశీలించారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా జలాశయం నుంచి 2.6టిఎంసీల నీటిని తిరుమలకు తరలించేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే కండలేరు జలాశయం నుంచి ప్రవాహం ద్వారా నీరు విడుదల చేసే అవకాశం లేకపోవడంతో పంపింగ్ ద్వారా నీరును తరలించేందుకు ప్రభుత్వం 24కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో కండలేరు జలాశయంలో నీటి నిల్వలను, పంపింగ్ పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 4.25టిఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు టిటిడి ఛైర్మెన్‌కు తెలియజేశారు. తెలుగుగంగ అధికారులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

### మద్యం అంగళ్లలో ఉద్యోగాలకు
## పోటెత్తిన దరఖాస్తులు

నెల్లూరుజిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కాంట్రాక్టు పద్ధతిపై ఏడాది పాటు సూపర్‌వైజర్లు, సప్లయిర్ పోస్టులకు దరఖాస్తులు పోటెత్తాయి. దరఖాస్తుల స్వీకరణ మంగళవారం రాత్రితో ముగియడంతో ఈ రెండు పోస్టులకు 1236మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అందులో సూపర్‌వైజర్ పోస్టులకు 594, సప్లయిర్ పోస్టులకు 642మంది దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 35 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 35సూపర్‌వైజర్లు, 82 సప్లయిర్ పోస్టుల భర్తీకి ఈ నెల 8న ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 15వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరిరోజుగా ప్రకటించారు. నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకకౌంటర్లు ఏర్పాటు చేశారు. 9నుండి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. మంగళవారం చివరిరోజు కావడంతో రాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఈ పోస్టులను దక్కించుకునేందుకు అభ్యర్థులు పలువురు అధికారపార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. అభ్యర్థుల మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నప్పటికి ఆచరణలో అది సఫలమయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

## భక్తులను భగవంతుడు ఆదుకుంటాడు

ఆపదలో వున్న భక్తులను భగవంతుడు ఆదుకుంటాడని గజేంద్రమోక్షంలోని ఘట్టాలను విశ్రాంత తెలుగు అధ్యాపకులు ఆలూరు శిరోమణి శర్మ అద్భుతంగా వివరించారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో సోమవారం భగవద్గీత ప్రవచనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్మయోగంపై నల్లమల్ల సత్యనారాయణ ఉపన్యసిస్తూ కోరికలను అదుపులో ఉంచుకుని మానవ జీవితానికి సార్థకత చేకూర్చుకోవాలని భగవద్గీతలోని కర్మయోగం తెలియజేస్తుందన్నారు. మానవులు కోరికల కారణంగా అధోగతి పాలవుతున్నారనే సత్యాన్ని గుర్తించి సన్మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కేతా సుబ్బారావు, యనమల నాగేశ్వరరావు యాదవ్, బి.వి.నరసింహం, పాటూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖకు బ్యారికేడ్లు

నెల్లూరుజిల్లాలోని మీనాక్షి ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పోలీస్ శాఖకు తొలివిడతగా 50బ్యారికేడ్లను బహుకరించింది. 250బ్యారికేడ్లను మంజూరు చేసేందుకు కంపెనీ ముందుకొచ్చిందని పోలీసు అధికారులు తెలిపారు. మిగిలిన బ్యారికేడ్లు త్వరలోనే రానున్నాయని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం గుంటూరు రేంజ్‌కు తొమ్మిది బ్రీత్‌ఎనలైజర్ పరికరాలను బహూకరించగా అపాచీ సంస్థ 300హెల్మెట్లను జిల్లా పోలీసులకు బహూకరించేందుకు ముందుకువచ్చి, ఇందులో భాగంగా 50హెల్మెట్లను అందజేసినట్లు తెలిపారు.

# మత్స్యకారులకు మంచి చేస్తాం..!

ఈ యేడాది బడ్జెట్‌లో మత్స్యశాఖకు రూ. 160కోట్లను ప్రభుత్వం ప్రకటించిందని, మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 11వ తేదీ నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండురోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన కుటుంబాలను ఆదుకునేందుకు నష్టపరిహారాన్ని రూ. 2లక్షలకు పెంచినట్లు తెలిపారు. తీరప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కావలి సమీపంలోని జువ్వలదిన్నె వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ. 200కోట్లను కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందని త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తీరంలో జలరవాణా అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ సీతారామరాజు, సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కోడూరు జయరామయ్య, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, విశాఖపట్నం మాజీమేయర్ జనార్ధన్, ముత్తుకూరు ఫిషరీస్ కళాశాల ప్రిన్సిపల్ హరిబాబు, మత్స్యశాఖ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ ప్రకాశరావు, అఖిల భారత సీమ రక్షక ప్రముఖ్ గోపాలకృష్ణన్ మత్స్యకార సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు కోలంగారి పోలయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనారాయణ, మురళీ, శ్రీరాములు, బాబు పాల్గొన్నారు.

# నెల్లూరుజిల్లాలో సైన్స్ మ్యూజియం

నెల్లూరుజిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు జాయింట్‌కలెక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నెల్లూరు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో మూడురోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏజేసీ మాట్లాడుతూ పిల్లల్లో పరిశీలనశక్తి పెంపొందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచితే అబ్దుల్‌కలాం లాంటి శాస్త్రవేత్తలు తయారవుతారన్నారు. విద్యార్థుల జయాపజయాల్లో ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. సైన్స్ మ్యూజియం ఏర్పాటు సందర్భంగా షార్ నుంచి రెండు రాకెట్లు తీసుకున్నామని, చెన్నై నుంచి కొన్ని నమూనాలు మ్యూజియంలో ఉంచనున్నామన్నారు. సైన్స్ మ్యూజియం కోసం జిల్లా సైన్స్ అధికారి సాంబశివరావు కృషి ఎనలేనిదన్నారు. ప్రదర్శనకు రాష్ట్ర పరిశీలకులుగా వచ్చిన నరశింహారెడ్డి మాట్లాడుతూ గణితంపై ఒక్క ప్రయోగం కూడా రాకపోవడం దురదృష్టకరమన్నారు. పైథాగరస్ సిద్ధాంతం తప్ప మరేమీ రాలేదని, ప్రస్తుతం కంప్యూటర్ యుగంలో గణితానికి ప్రాధాన్యత ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా నుంచి 1650 ప్రయోగాలు రాగా గూడూరు, కావలి, నెల్లూరు డివిజన్లుగా ఏర్పాటు చేసి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించామన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రయోగనమూనాలు ఈ నెల 21, 22, 23తేదీల్లో ప్రదర్శనల్లో ఉంచుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సాంబశివరావు, నెల్లూరు ఉపవిద్యాశాఖాధికారి షామహ్మద్, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి రమేష్‌బాబు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ సివిఎస్ భాస్కర్, లెక్చరర్ డాక్టర్ సి.వెంకటరామయ్య పాల్గొన్నారు.

## పిఎస్ఎల్‌వి-సి30కి రెడీ!

శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ఈ నెల 28న పిఎస్ఎల్‌వి-సి30 రాకెట్‌ను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు అంతా సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ వాహననౌక ద్వారా మన దేశానికి చెందిన ఆస్ట్రోశాట్‌తో పాటు మరో ఆరు విదేశీ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు.

## గ్రామ సర్పంచ్‌లకు అన్యాయం

నెల్లూరుజిల్లాలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలతో గ్రామాల్లోని సర్పంచ్‌లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి విషయంలో జన్మభూమి కమిటీలు సర్పంచ్‌లను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కమిటీలో స్థానిక సర్పంచ్ సంతకం ఉండాలనే నిబంధనను జన్మభూమి కమిటీలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో సర్పంచ్‌లతో సంబంధం లేకుండా జన్మభూమి కమిటీలే అన్ని పనులు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ సమావేశంలో శ్రీనివాసులురెడ్డి, శశిధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

# నెల్లూరీయుడు సతీష్‌రెడ్డికి లండన్ విశిష్ట పురస్కారం



నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు వాసి, భారత రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు గండ్రా సతీష్‌రెడ్డికి ప్రపంచంలోనే అరుదైన విశిష్ట పురస్కారం లభించింది. లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక ఏరోనాటికల్ సొసైటీ ఆయనకు సిల్వర్ మెడల్‌ను ప్రకటించింది. 1909 నుండి కూడా విమానయాన రంగంలో విశేష కృషి చేసిన వారికి సొసైటీ ఈ మెడల్‌ను ప్రకటిస్తోంది. భారత్ నుండి గతంలో ఇద్దరు ఈ పురస్కారాన్ని అందుకున్నప్పటికీ, పదవీ విరమణ అనంతరమే వారికి లభించాయి. పదవిలో వున్నప్పుడే ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడు సతీష్‌రెడ్డి. డిసెంబర్ 9వ తేదీన లండన్‌లో జరిగే కార్యక్రమంలో సతీష్‌రెడ్డి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. దేశ సేవలో తరిస్తూ, నెల్లూరుజిల్లా పేరును అంతర్జాతీయంగా నిలబెడుతూ తన శక్తి యుక్తులతో దేశభక్తిని చాటుకుంటూ విశిష్ట పురస్కారానికి ఎంపికైన సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

### అంతర్జాతీయ హిందీ సదస్సులో

# నెల్లూరు అధ్యాపకురాలు శైలజ



ప్రముఖ హిందీ రచయిత్రి శ్రీమతి మధు ధావన్‌తో శైలజ

ఈ నెల 10, 11, 12 తేదీలలో మధ్య ప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన 10వ అంతర్జాతీయ హిందీ సదస్సులో నెల్లూరుకు చెందిన ప్రముఖ హిందీ అధ్యాపకురాలు, సాహితీవేత్త శ్రీమతి పి.శైలజ పాల్గొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర విదేశాంగశాఖ నిర్వహించిన ఈ సదస్సుకు శైలజకు ఆహ్వానం అందడం ఎంతైనా అభినందనీయం. 139 దేశాల ప్రతినిధులు, హిందీ భాషా కోవిదులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కేంద్ర విదేశాంగశాఖ మంత్రి శ్రీమతి సుష్మాస్వరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించగా, కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, చత్తీష్‌ఘడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌లతో పాటు గవర్నర్లు, కేంద్రమంత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న శైలజ హిందీ భాషాభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేసారు. ప్రపంచ స్థాయి భాషా సదస్సులో తన ప్రతిభను చాటుకున్న శైలజకు 'లాయర్' అభినందనలు.




# మోడరన్ గణపతి

వినాయకచవితి పర్వదినం సందర్భంగా నెల్లూరు సరస్వతీనగర్‌లోని మోడరన్ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన కంప్యూటర్ వినాయకుడి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణ య్యింది. విద్యార్థుల తల్లిదండ్రులు అదిపనిగా వచ్చి ఈ కంప్యూటర్ గణపయ్యను చూసి తరించారు. కంప్యూటర్‌లోని అన్ని భాగాలను తీసుకుని ఈ ప్రతిమను తయారు చేశారు. స్కూల్ కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రవీంద్ర కుమార్, కంప్యూటర్ మాస్టర్ కమలకుమార్‌ల సహకారంతో విద్యార్థులు ఈ కంప్యూటర్ గణేష్‌ను తయారు చేశారు.

# సైన్స్‌ఫేర్‌లో మైథిలి ప్రాజెక్ట్ ఎంపిక



ఈ నెల 12, 13, 14తేదీలలో నెల్లూరులోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో జరిగిన 5వ ఇన్స్‌పైర్-2015 ప్రదర్శనలో మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థి జి.వరుణ్ చంద్రసాయి తయారు చేసిన "భూగర్భ వేడి నుండి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి" అనే ప్రాజెక్ట్ నమూనా రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైంది. ఈ నెల 21, 22, 23తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్‌లో ఈ నమూనాను ప్రదర్శించనున్నారు. మంచి ప్రాజెక్ట్‌తో స్కూల్‌కు కీర్తి తెచ్చిన వరుణ్‌చంద్ర సాయిని స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్‌రెడ్డి అభినందించారు.

# పిచ్చెక్కిస్తున్న.. మంత్రి నారాయణ



- **మూగనోము పాటిస్తున్న ప్రతిపక్షం**
- **ఒక్క అనిల్‌కుమార్‌యాదవ్ తప్ప ఎవ్వరూ నోరెత్తడం లేదు**






*మంత్రి నారాయణ జిల్లాలో తన పార్టీవాళ్లకే కాక ఇతర పార్టీ వాళ్లకూ, ప్రజలకూ పిచ్చెక్కిస్తున్నాడు. పగలు కనపడడు ఎక్కడా వినపడడు సమ స్యలపైన స్పందించడు... అన్నింటినీ మించి అర్ధరాత్రి పూట రోడ్లపై పర్యటించి తెల్లవారుఝామునే మాయమైపోతాడు. నెల్లూరు జిల్లాతో పాటు జిల్లా కేంద్రమైన నగరం కూడా నారాయణ దెబ్బకి గజగజలాడిపోతోంది. కొద్దిరోజులు పోతే "ఓ స్త్రీ రేపురా" అని గతంలో ఇళ్ల తలుపులపైన రాసుకున్నట్లు "ఓ మంత్రి పగలు రా" అని ప్రజలు రాసుకునే పరిస్థితి దాపురిస్తుందేమో!*

ఇటీవల మంత్రి జరిపిన రాత్రి పర్యటనలో మాజీకార్పొరేటర్ కప్పిర శ్రీనివాసులు చొక్కా చించుకుని తల గోడకు కొట్టుకుని బట్టలూడదీసుకుంటూ రోడ్డుపై పరిగెత్తాడట. మంత్రి వైఖరి చూస్తుంటే రాబోయే రోజుల్లో అందరి పరిస్థితీ కప్పిర శీనులా మారుతుందేమోనని రాజకీయ మేధావులు భయపడి ఛస్తున్నారు.

ఇంత జరుగుతుంటే మంత్రి చేష్టలకు చిర్రెత్తుకొచ్చి ఆయన సొంత పార్టీవాళ్లే తిట్టిపోస్తుంటే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసలు నోరెత్తడం లేదు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశానికి కూడా నారాయణ రాలేదు. ఈ విషయమై సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి కానీ లేదా రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కాని నోరెత్తలేదు. వారే కాదు మిగిలిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలెవ్వరూ మంత్రి వైఖరి పట్ల పెద్దగా స్పందించడం లేదు.

పాపం అనిల్‌కుమార్‌యాదవ్ మాత్రం అలసిపోయేటట్లు రోజూ మంత్రిపై ధ్వజమెత్తుతూనే వున్నాడు. నారాయణ ఈ రాష్ట్రానికే మంత్రి అన్న విషయం కాసేపు మర్చిపోతే మునిసిపల్ శాఖ మంత్రిగా నెల్లూరు నగరానికి ఆయన చాలా చేస్తాడని అనిల్‌తో పాటు అమాయక ప్రజలందరూ వూహించారు. కానీ మంత్రి రాత్రిళ్ళు పర్యటించి అంతా బాగానే వుంది శభాష్ అని ఆయన భుజం ఆయనే తట్టుకుని తిరిగి వెళ్ళిపోతున్నాడు. మంత్రి 'రాత్ కా రాజా' అంటూ అనిల్ పదేపదే విమర్శిస్తున్నా ఈ విషయం పత్రికల్లో వస్తున్నా మంత్రిలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.

ఇక్కడ ఇంకో ముఖ్య విషయం మీడియా. సహజంగా ఇలాంటి వైఖరి ఇంకేమంత్రన్నా అవలంబించి వుంటే ప్రధాన పత్రికలతో పాటు ఛానళ్ళు కూడా పతాక శీర్షికన కథనాలు చేసివుండేవాళ్ళు. కానీ మంత్రి తన విద్యాసంస్థల ద్వారా కోట్ల రూపాయల ప్రకటనలు వీళ్ళ ముఖాన పడేస్తుండడంతో అటు ఎలక్ట్రానిక్, ఇటు ప్రింట్ మీడియాలు సైతం నారాయణ మంత్రం జపిస్తున్నాయి. ఆయన అర్ధరాత్రో అపరాత్రో పర్యటిస్తే ఆ టైంలో ఆయన వెంట తోక వూపుకుంటూ తిరిగి తెల్లవారి తమతమ పేపర్లలోనో లేదా ఛానళ్ళలోనో ప్రచురించడమో, ప్రసారం చేయడమో చేస్తున్నారు.


ఇప్పటికైనా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కొంచెం తీవ్రంగా స్పందిస్తే మంత్రి వైఖరిలో మార్పు రాకపోయినా పార్టీ అధినాయకుడు కొంచెం కళ్లు తెరుచుకుని జిల్లాకి మరో మంత్రి పదవైనా ఇస్తాడు. లేదంటే ఇటు జిల్లా అభివృద్ధిపరంగా పతనం కావడంతో పాటు తెలుగుదేశం పార్టీ కూడా భూస్థాపితమైపోతుంది.

# సిఎంఆర్ మట్టి వినాయకులు



పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రతి యేటా వినాయకచవితికి నెల్లూరులోని సిఎంఆర్ షాపింగ్‌మాల్ వారు తమ ఖాతాదారులకు, నగర ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తుంటారు. ఈ క్రమంలో భాగంగానే ఈనెల 16వ తేదీన సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో జిల్లా కలెక్టర్ యం.జానకి ఖాతాదారులకు మట్టి వినాయక బొమ్మలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి శ్రీనివాస రావు, రాజీయాడ్స్ అధినేత అలంకార్ పెంచలయ్యలు పాల్గొన్నారు.

# అపోలోలో హిప్‌ఆర్థ్రోస్కోపి




నెల్లూరు అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్‌లో హిప్‌ఆర్థ్రోస్కోపి ఫర్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించినట్లు అపోలో ఆసుపత్రి విభాగ చీఫ్ సర్జన్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆర్థ్రోస్కోపిలో హిప్ ఆర్థ్రోస్కోపి అత్యంత వేగవంతమయిన ప్రక్రియని, చిన్న గాటు పెట్టి శస్త్ర చికిత్స చేయవచ్చన్నారు. మోకాలు, కీళ్ల నొప్పులు, అదనపు కీళ్ల విభాగాలను సరిచేసి నొప్పి లేకుండా చేయడమే ఈ విధానంలో ప్రత్యేకత అన్నారు. ఈ హిప్‌ఆర్థ్రోస్కోపి వైద్యం కొత్తగా వచ్చిందన్నారు. ఫెమరోసీ టాబ్యులార్ ఇంపింజ్‌మెంట్ ప్రాంతం మధ్యలోనే కాక చుట్టుపక్కల శరీరంలోని ఇబ్బందులను తొలగించవచ్చని ఆయన తెలిపారు.

## 'ప్రభా'తం

# సరిహద్దుల్లో శాంతికి బాట

**సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఉల్లం ఘనలు, సీమాంతర చొరబాట్లు తదితర అంశాలను ఉమ్మడిగా పరిష్కరించుసేందుకు, వాటిపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఇరుదేశాలూ ఒక అంగీకారానికి రావడం భారత్-పాక్ సంబంధాల్లో ఒక మేలిమలుపు. సరిహద్దుల్లో శాంతి స్థాపనకు ఆ మేరకు ఇరుదేశాల భద్రతాధికారులు ఒక అంగీకారానికి రావడమన్నది శుభపరిణామమే!.. అయితే, ఆ చర్యలు పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చినప్పుడే సార్థకత. సరిహద్దు ప్రజలకు అప్పుడే అసలైన ఊరట. అందుకు ఇరుదేశాలూ కంకణబద్ధులు కావాలి.**

సరిహద్దుల్లో శాంతి స్థాపనకు భారత్-పాక్‌లు కీలకమైన చర్యలు చేపట్టడం, ఇరుదేశాలూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒకరికొకరు సమ్మతించడం.. తదితర తాజా పరిణామాలు సరిహద్దుల్లో శాంతికి బాసటగా నిలిచేలా వున్నాయి. ఇదెంతో శుభపరిణామం. జమ్ముకాశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి మోర్టార్ దాడులపై పూర్తి నిషేధం విధించాలని ఇరుదేశాల భద్రతాధికారులు ఇటీవల ఒక నిర్ణయానికి రావడం, తద్వారా ఇరుదేశాల సంబంధాలు మెరుగుపడేందుకు తగు చర్యలు జరగడం.. ఆహ్వానించదగ్గ పరిణామం.

సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఉల్లంఘనలు, సీమాంతర చొరబాట్లు తదితర సున్నితమైన అంశాలను ఉమ్మడిగా పరిష్కరించునేందుకు, వాటిపై ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఇరుదేశాలూ ఒక అంగీకారానికి రావడం భారత్-పాక్ సంబంధాల్లో ఒక మేలిమలుపు అని చెప్పవచ్చు. తాజా పరిణామాల నేపథ్యంలో, ఇరుదేశాల డీజీలు (డైరెక్టర్ జనరల్స్) అంగీకార పత్రంపై సంతకాలు చేశారు కూడా. బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దేవేంద్రకుమార్ పాఠక్, పాక్ రేంజర్స్ డైరెక్టర్ జనరల్ ఉమర్ ఫరూఖ్ బుర్కీ, ఆ మేరకు 20 సూత్రాల ఉమ్మడి చర్చల రికార్డుపై సంతకాలు చేయడం సంతోషకర పరిణామం. సరిహద్దుల్లో కొన్ని నెలలుగా మోర్టార్ షెల్స్ ప్రయోగం కారణంగా ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎక్కువగా జరుగుతున్న విషయం తెలిసిందే. అందువల్ల వాటి నివారణకు ఈ ఒప్పందం ఎంతగానో సహకరిస్తుందని ఆశించవచ్చు. తద్వారా సరిహద్దుల్లో ప్రశాంతతకు మార్గం సుగమం కావచ్చునని భావించవచ్చు.

సుహృద్భావ వాతావరణంలో, స్నేహపూర్వకంగా కలసి మెలసి ఆలోచిస్తే, ఎంతటి జటిలమైన సమస్యలనైనా పరిష్కారం దొరుకుతుంది. ఎంతో కాలం నుంచి పాక్ దుందుడుకు చర్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో, ఇలాంటి స్నేహపూర్వక చర్చలు జరగడం, సరిహద్దుల్లో శాంతికి బాటలు వేసేలా తీసుకోవాల్సిన చర్యల గురించి ఒకరికొకరు మనసువిప్పి మాట్లాడుకోవడం, ఇరుదేశాలకూ ఇబ్బందిలేని విధంగా తగు నిర్ణయాలు తీసుకోవడం ఎంతైనా సంతోషించదగ్గదే. అందులోనూ, ఇరుదేశాల డైరెక్టర్ జనరల్స్ ఢిల్లీలో జరిపిన సమావేశంలో ఆ మేరకు పలు మంచి నిర్ణయాలు తీసుకోవడం, భవిష్యత్తులో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తగ్గిపోయి, ప్రశాంతత నెలకొనే అవకాశం వుంటుందనే భావన సర్వత్రా కలుగుతోంది. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వచ్చి మీదపడుతుందో తెలియక, రాత్రనక పగలనక ఆందోళనతో.. సరిహద్దు ప్రాంతాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న ప్రజలకు ఇది ఒకరకంగా మంచి ఊరట కలిగించే పరిణామమనే అనుకోవచ్చు. గత ఏడాది కూడా ఇదే భయాందోళనలతోనే జమ్మూ సరిహద్దులోని అనేకమంది ప్రజలు బ్రతుకు జీవుడా.. అంటూ వలసబాట పట్టారు. ఇన్నాళ్లకైనా ఈ సమస్య పరిష్కారానికి ఇరుదేశాలు సంకల్పించడంతో సరిహద్దుల్లో ప్రజలకు ఇది ఊరట కలిగించే అంశమైంది.

అయితే, అంతమాత్రాన్నే పాక్ శాంతియుతంగానే వ్యవహరిస్తుందని అనుకోలేం. ఎంతోకాలం నుంచి భారతదేశాన్ని అస్తవ్యస్తం చేయడం కోసం పాక్ ప్రయత్నాలు చేస్తుండడం, ఉగ్రవాద విషసర్పాలను పెంచి పోషించి వాటిని భారత్‌లోకి వదులుతుండడం, సరిహద్దుల్ని యుద్ధభూములుగా మారుస్తుండడం పాక్‌కు అలవాటే. పాక్ ఉగ్రవాదానికి పుట్టిల్లుగా మారింది. అందువల్లనే, ఎప్పటికప్పుడు శాంతి ఒప్పందాలు చేసుకుంటున్నా, వాటిని ఉల్లంఘించేందుకు పాక్ ఎప్పుడూ వెనుకాడడం లేదు. అనేక సంఘటనల్లో ఇది రుజువై వుంది కూడా. 2004 ప్రాంతాల్లోనే, భారత్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఉగ్రవాదాన్నీ ప్రేరేపించేది లేదని హామీ ఇచ్చిన పాక్, ఆ తర్వాత ముంబై ముట్టడికి తలపెట్టినవారిని అక్కున చేర్చుకోవడం, ఉగ్రవాదాన్ని విడనాడకపోగా దానిని మరింతగా ప్రేరేపించడం వగైరా చర్యలతో.. తన నిజస్వరూపం ఏమిటో పాక్ ఎప్పటికప్పుడు చూపుతూనే వుంది. ఉగ్రవాదంపై అందరూ పోరు సాగించాలని, శాంతి స్థాపనే ధ్యేయంగా అందరూ కృషిచేయాలని భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచవ్యాప్తంగా ఏ దేశానికి వెళ్ళినా ఉగ్రవాద పాక్ మాత్రం ఎప్పటికప్పుడు 'సరే'నంటూనే, తన పాత దారిలోనే పోకుంటూ పోతోంది. ఇది ముమ్మాటికీ సముచితమైన విధానం కాదని భారత్ పదేపదే చెప్తున్నప్పటికీ, తన చిత్తానుసారం సరిహద్దుల్లో కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే వుండడం పాక్‌కు అలవాటైపోయింది. ఎక్కడైనా సరే, సయోధ్య చర్చలు, ఆ పై శాంతియుతమైన చర్యలను ఎవరైనా సంతోషిస్తారే తప్ప, చెప్పేదొకటి-చేసేదొకటి అన్నట్లుగా వుంటే ఎవరినైనా సరే విశ్వాసంలోకి తీసుకోరు. ఇప్పుడు జరుగుతున్నదదే. భారత్-పాక్‌లు సరిహద్దుల్లో కాల్పులు జరపకూడదని గత శనివారం శాంతియుతమైన అంగీకారం కుదుర్చుకుని ఇరవైనాలుగు గంటలు కూడా గడవకముందే పాక్ మళ్ళీ తుపాకీ ఎత్తింది. జమ్ము కాశ్మీర్‌లోని రాజోరి జిల్లా సరిహద్దుల్లో ఆదివారం జరిపిన కాల్పుల్లో బిఎస్ఎఫ్ అధికారి మృతి చెందారు. దీంతో, పాక్ నైజం మరోసారి బయట పడినట్లయింది. ఇలా.. చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించడమన్నది పాక్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఇకనైనా ఆ తీరు మారుతుందనే కోరుకుందాం.

ఏదేమైనా, ఇరుదేశాల భద్రతాధికారులు సరిహద్దుల్లో శాంతి స్థాపనకు ఒక అంగీకారానికి రావడమన్నది మంచి పరిణామమే.. హర్షదాయకమే.. అయితే, ఆ అంగీకారం పూర్తిగా అమలులోకి వస్తేనే సార్థకత. సరిహద్దు ప్రజలకు అప్పుడే అసలైన ఊరట.

# ముగిసిన శ్రావణ మాసం

శ్రావణ మాసం చివరి శుక్రవారం నెల్లూరు నగరంలోని అన్ని మహాలక్ష్మమ్మ దేవాలయాలు శోభాయమానంగా విలసిల్లాయి. శ్రావణ మాసపు పూజలు చేసే మహిళలతో అమ్మవారి ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. విశేష అలంకారంతో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారికి మహిళలు భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషమైన గాజుల అలంకారంతో కళకళలాడింది. గాజుల అలంకారాన్ని కనకదుర్గా సేవాసమితి కొలపర్తి రమేష్‌బాబు మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సహాయ కమిషనర్ పి.కోదండరామిరెడ్డి, ఆలయ వ్యవస్థాపక సభ్యులు రత్నం జయరాం పర్యవేక్షణలో ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, సుబ్బారావు స్వామి, రవిస్వామి, రఘుస్వామి, వేదపండితులు ఎ.వెంకటరామకృష్ణశర్మ అవధాని నేతృత్వంలో పూజలు విశేషంగా జరిగాయి.

స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో 11వ తేదీ అర్బన్ ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పులవీధి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నుంచి మహిళలు పసుపుకొమ్ములతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విశేషపూల దర్బార్ అలంకారాలు కనులపండువగా నిర్వహించారు. 108మంది మహిళలకు జాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఛైర్మన్ మునగా వెంకటేశ్వర్లు, నగర డిప్యూటీమేయర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్ పాల్గొన్నారు.

మూలాపేటలోని సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు చందనాలంకారం నిజరూప దర్శనంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వి.శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

దర్గామిట్టలోని అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో స్వర్ణమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకపూజలు, క్షీరాభిషేకాలు జరిగాయి. ఉత్సవమూర్తికి అభిషేకాలు, అష్టలక్ష్మి పూజలు నిర్వహించారు. మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణ అవతారోత్సవాల్లో భాగంగా స్వామివారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.




## ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా, చిల్లకూరు మండలం, అంకులపాటూరు రెవెన్యూలో వున్న ఏరూరు, అంకులపాటూరు గ్రామంలో వున్న వివిధ ప్రభుత్వ భూములను కొంతమంది 'దళారులు, భూకబ్జాదారులు' ఆక్రమించి వాటిలో రొయ్యల గుంటలు వేసి యితరులకు లీజులకిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ఏరూరు గ్రామంలో వున్న మేతపోరంబోకులు కూడా ఆక్రమించి పశువులు తిరగడానికి కూడా వీలు లేకుండా చేసారు. సర్వే నెం. 583, 589, 575, 579వగైరాలు ప్రక్కన వున్న వందలాది ఎకరాలు వీరి ఆక్రమణలో వున్నాయి. వీరికి ఏరూరు గ్రామ విఆర్‌ఓ, ఆర్ఐ, సర్వేయర్లు, మండల అధికారులు సహకరిస్తున్నారు. ఈ విఆర్‌ఓ 20సంవత్సరాలుగా బదిలీ లేకుండా అదే గ్రామంలో వున్నాడు. ఆర్ఐ 15సంవత్సరాలుపైగా చిల్లకూరు మండలంలో వున్నాడు. వారికి ఇతర రెవెన్యూ అధికారుల మద్దతు వుంది. ఈ ఆక్రమణలు సుమారు 2500 ఎకరాలపైగా ఉన్నాయి. వీరికి ఎలక్ట్రిసిటీ అధికారులు సహాయం చేస్తూ అక్రమ సర్వీసులు ఇస్తున్నారు. వీరి సహకారం లేనిదే ఒక్క ఎకరా పొలం కూడా ఈ ఆక్రమణదారులు రొయ్యల గంటలు సాగు చెయ్యలేరు. ఈ విధంగా ఏరూరు, అంకులపాటూరు గ్రామంలో వున్న వివిధ రకాల ప్రభుత్వ భూములు సుమారు 2500ఎకరాలకి పైగా ఆక్రమణదారుల చేతుల్లో వున్నాయి. కానీ, రెవెన్యూ అధికారులలో స్పందన లేదు.

*ఎ.అంకమ్మ, అంకులపాటూరు.*

## మెట్రో అంత అవసరమా?

మింగను మెతుకు లేకుంటే మీసాలకు సంపెంగనూనె అన్నట్లుగా వుంది ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారం. విజయవాడలో మెట్రోరైలు ప్రాజెక్టును వేలకోట్ల రూపాయలతో ప్రభుత్వ నిధులతోనే చేపడుతున్నారు. ఇది ఆర్భాటం తప్ప ఇంకోటి కాదు. మెట్రో రైలు వల్ల ఇప్పటికిప్పుడు అక్కడ ఒరిగేదేమీ వుండదు. మెట్రోకు నష్టం తప్ప లాభం లేదు. ఈ డబ్బులేవో పోలవరంతో పాటు మరికొన్ని పెండింగ్ ప్రాజెక్టులకు ఖర్చు పెడితే రైతులన్నా బాగుపడతారు కదా!

*నూకా శివరాం, జిల్లెళ్లపాలెం.*

## విప్లవం రావాలి

తేది 11.09.2015 సంచికలో 'పేదల పోరాటం' సంపాదకీయం దేశంలో పేద ప్రజల మనోభావాలకు అద్దం పట్టింది. దేశంలో ఏడు దశాబ్దాలుగా కొనసాగుతున్న రిజర్వేషన్లు ప్రతిభనే కాదు దేశ ప్రగతిని కూడా అడ్డుకుంటున్నాయి. దేశంలో సామాజిక అస్పృశ్యత కంటే ఆర్థిక అస్పృశ్యత ఎక్కువగా వుందన్నది పచ్చి నిజం. సమాజం మీరు చెప్పినట్లు పేద, ధనిక కులాలుగా విడిపోయింది. ఈ ప్రభుత్వ విధానాలు అన్ని విధాలా ధనిక కులానికే అనుకూలంగా ఉంటున్నాయి. కులాలకు అతీతంగా రిజర్వేషన్ల ఊద్యమం పేదలంతా తిరగబడాలి. ఓ పక్క రాజకీయ నాయకులు భారతీయ మేధావులు ఇతర దేశాలకు తరలిపోతున్నారు అని అంటుంటారు. మరో పక్క రిజర్వేషన్లు అమలు కావాలి అంటారు. ఇక్కడ వారి ప్రతిభకు ఈ రిజర్వేషన్లు ప్రతిబంధకాలు అవుతున్నప్పుడు ఎవరైనా తమ ప్రతిభకు తగ్గ విలువనిచ్చే దేశాలకే పోవాలనుకుంటారు కదా.


*జి.వి.సి.చౌదరి, నెల్లూరు.*

## అవినీతి పందులు

ప్రభుత్వ శాఖల్లో కొందరు ఉద్యోగులు అవినీతి పందులవుతున్నారు. ఈ ఉద్యోగుల చొక్కా, ఫ్యాంటు, వాళ్లావిడ రవిక, చీరలు మనమిచ్చిన లంచాలతో కొన్నవే! కనీసం వీళ్లకు సిగ్గు అనిపించడం లేదు. లంచాలతో దేశ ద్రోహువుతున్నారు. ప్రభుత్వం నుండి పెద్ద మొత్తాలలో జీతాలు బొక్కుతూ మళ్లీ లంచాలకు పీడిస్తున్నారు. ఇదేమి పాడుబుద్ధి. ఈ దేశానికి ఈ పీడ ఎప్పుడు విరుగుడవుద్ది!

*వాస్తు రామచంద్ర, నెల్లూరు.*

# పండు పండు పండు... తింటే కడుపు పుండు





*రోజుకొక ఆపిల్ తింటే డాక్టర్‌తో పని లేదు... అరటి పండులో మంచి కాల్షియం ఉంటుంది... జామపండు అన్ని రోగాలకు ఔషధం... బత్తాయి కొవ్వును కరిగిస్తుంది.. బొప్పాయి జీర్ణశక్తికి మంచిది... తమ వద్దకొచ్చిన రోగులకు డాక్టర్లు చెప్పే సలహాలివి. ఏ టీవీ చూసినా, ఏ పత్రిక చూసినా పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటారనే చెబుతుంటాయి. జంక్ ఫుడ్డు వద్దు... పండ్లు ముద్దు అని మరీ ప్రకటనలు చేస్తుంటారు. రోజూ మనం తీసుకునే ఆహారంలో ఒక పండయినా ఉండాలంటారు.*

నిజమే... పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. అయితే ఇప్పుడు మనకు మార్కెట్లో దొరికే పండ్లను తింటే ఆరోగ్యం కాదు కదా అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడమే అవుతుంది. ఇప్పుడు సకల రోగాలకు కారణం మనం తినే ఆహారం, తాగే నీళ్లు. నూటికి ఖచ్చితంగా 70శాతం మందిలో షుగర్‌లు, బి.పిలు ఉంటున్నాయి. దీనికి కారణం ఆహారం. సాంబారు బాగుందనో, పచ్చడి కమ్మగా వుందనో గిన్నెడు అన్నం తింటాం. మనం తినే బియ్యం స్వచ్ఛమైనవి కాదు, రసాయనాలు వేసి పండించినవి. ఇక మోతాదుకు మించి తింటుంటాం. కారాలు, ఉప్పులను ఆపుకోలేం. ఉప్పు, కారం లేనిదే మనకు ముద్ద దిగదు. తిండి గింజలు సరే పండ్లన్నా స్వచ్ఛంగా దొరుకుతున్నాయా అంటే అదీ లేదు. మార్కెట్లో దొరికే ఆపిల్స్ చూడడానికి నిగనిగ మెరుస్తుంటాయి. ఆ మెరుపు వెనుక విషం, మోసం వుందని కొనుగోలుదారుడు గ్రహించ లేడు. ఆపిల్స్‌ను ఎక్కువ కాలం నిల్వ చేస్తుంటారు. అందుకోసం మెరుపు తగ్గకుండా వుండేందుకు ప్రతి పండుపైనా ఒక రకమైన రసాయనం పూస్తారు. ఇలాంటి పండ్లు తింటే డాక్టర్‌తో పనిలేకుండా పోవడం కాదు, ప్రతిరోజూ డాక్టర్ దగ్గరకు పోవాల్సి వుంటుంది. పక్వానికి రాకముందే మామిడి పండ్లు, అరటి పండ్లను సైతం వివిధ రసాయనాలతో మాగపెడుతుంటారు. వీటిని తిన్నా ఆరోగ్యానికి హానికరమే. సీజన్‌లో చూసేదానికి మామిడి పండ్లు నిగనిగలాడుతుంటాయి. కొనుక్కుని ఇంటికెళ్లి కోస్తే తినడానికి అనువుగా వుండదు. పుచ్చకాయలు లోపల ఎర్రగా ఉండడం కోసం ఇంజక్షన్‌ల ద్వారా ఓ కెమికల్‌ను పంపిస్తున్నారు. ఇది కూడా ఆరోగ్యానికి చేటే.

రసాయనాలతో పండ్లను మాగేస్తున్న వ్యాపారులు ఉగ్రవాదుల కంటే ప్రమాదకారులని ఇటీవల హైకోర్టు తీవ్రంగా వ్యాఖ్యానించింది. నిజమే ఉగ్రవాదులు ఒక్క తూటాతో మనిషిని చంపేస్తారు. కాని విషపూరిత పండ్లు తినడం వల్ల మనుషులు క్యాన్సర్, కిడ్నీ, కాలేయం వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి, ఆసుపత్రులకు లక్షలు ధారబోసి, నెలల కాలాల పాటూ నరకం అనుభవించి చనిపోతున్నారు. హైకోర్టు తీర్పుతోనన్నా పండ్ల వ్యాపారుల ధోరణిలో మార్పు రావాలి. పండ్లు ఆరోగ్య కారకాలు కావాలేగాని, అనారోగ్య హేతువులు కాకూడదు.



# ప్లాస్టిక్ లేని నెల్లూరు సాధ్యమేనా?



ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించిన కమిషనర్ పివివిఎస్ మూర్తి

*ఇప్పుడున్నది ప్లాస్టిక్ ప్రపంచం... మనిషి నిద్రలేచింది మొదలు మళ్లీ నిద్రపోయేదాకా ప్లాస్టిక్ వాడకానికి బాగా అలవాటు పడ్డాడు. కూరగాయలు తెచ్చే కవర్ ప్లాస్టిక్... సరుకులు తెచ్చే కవర్ ప్లాస్టిక్... పాలప్యాకెట్ ప్లాస్టిక్.. ఆఖరకు హోటల్స్‌లో అన్నం, కూరల ప్యాకింగ్ అంతా ప్లాస్టిక్‌తోనే... ప్రతి ఊరిలో పోగయ్యే చెత్తలో సగం ప్లాస్టిక్ కవర్లే ఉంటున్నాయి.*

నెల్లూరును ప్లాస్టిక్ రహిత నగరంగా మారుస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి శపథం చేశారు. నిజమే... ఆయన శపథం నెరవేరితే అంతకంటే కావాల్సిందేముంది. అయితే ఇది కమిషనర్ వ్యక్తిగత శపథం కాదని, నగర ప్రజల భద్రత కోసం చేసిన శపథమని మనమంతా కూడా గ్రహించాలి. ప్లాస్టిక్ రహిత నెల్లూరు కోసం వ్యాపారులు, ప్రజలు సహకరించాలి.

ఈరోజు కూరగాయల మార్కెట్‌లో చూసినా, దుకాణాలలో, హోటల్స్‌లో, ఇతర అన్ని వ్యాపార సంస్థల్లో క్యారీ బ్యాగులు విచ్చలవిడిగా ఉంటున్నాయి. సరుకులు, కూరగాయలకు ఈ క్యారీ బ్యాగులనే ఎక్కువుగా వాడుతున్నారు. ఈ ప్లాస్టిక్ కవర్లు తిరిగి చెత్తలో కలుస్తున్నాయి. చెత్తదిబ్బల వద్ద పశువులు వీటిని మింగి ప్రాణాలు కోల్పోతున్నాయి. అంతే కాక ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి కూడా పెద్ద ప్రమాదం. ప్లాస్టిక్ సంచులు నగరంలో డ్రైనేజీకి పెద్ద అవరోధంగా మారుతున్నాయి. చెత్తలో కలిపి ప్లాస్టిక్ సంచులను డ్రైనేజీ కాలువల్లో పడేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ సంచులు అడ్డుపడడంతో మురికినీటి ప్రవాహం ఆగిపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి.

నెల్లూరును ప్లాస్టిక్ రహిత నగరంగా మార్చే ప్రక్రియలో నగరంలో పలు దుకాణాలపై దాడులు నిర్వహించడం, క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. గతంలో కూడా ఇలాంటి ప్రయత్నాలు జరిగి విఫలమయ్యాయి. దుకాణాల మీద దాడులు చేసి క్యారీబ్యాగ్స్ నిల్వలను స్వాధీనం చేసుకోవడం కంటే కూడా, క్యారీ బ్యాగుల ఉత్పత్తులనే నిషేధించే దిశగా ఆలోచిస్తే మంచిది. ప్రజలు కూడా క్యారీబ్యాగుల వాడకానికి స్వస్తి పలికి, గుడ్డసంచులు, నారసంచుల వాడకానికి అలవాటు పడితే బాగుంటుంది.

# నిరుద్యోగులకో వరం... పిఎంకెవై

- పైసా ఖర్చు లేకుండా శిక్షణ ఇస్తారు
- అతివిలువైన 'డిగ్రీ' అందజేస్తారు



వంశీకృష్ణ, మేనేజింగ్ పార్టనర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ పవర్ టెక్నాలజీస్ & ఒకేషనల్ ట్రైనింగ్

*దేశాన్ని పట్టిపీడిస్తున్న సమస్య నిరుద్యోగం. ఈ పదాన్ని మొన్న విన్నాం, నిన్న విన్నాం. యువత తెలివిగా ఆలోచించకపోతే రేపు కూడా వింటూనే వుంటాం. ఎందుకంటే ఉపాధి కోసం మన ముందు అనేక దారులుండగా ఈనాటి యువతంతా కూడా కేవలం ఒకట్రెండు దారులనే ఎంచుకుంటోంది. దాంతో మిగతా దారుల్లో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నా నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.*

ప్రతిఒక్కరూ సాఫ్ట్‌వేర్, డాక్టర్, ఇంజనీర్‌లు కావాలను కుంటారు... ఈ రంగాలలో పోటీతత్వం ఎక్కువ. ఒక్క పోస్టుకు వందమంది నిష్పత్తిలో అభ్యర్థులున్నారు. ఈ మార్గంలో చదివే వాళ్లు ఎక్కువ. అవకాశాలు అందుకునే వాళ్లు తక్కువ. అందుకనే నేటి యువత భిన్న కోణంలో ఆలో చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరుద్యోగాన్ని రూపుమాపడానికి కేంద్రప్రభుత్వం తన శాయశక్తులా కృషి చేస్తూనే వుంది. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను నిరుద్యోగులు అందిపుచ్చు కోవాలి.

ఈరోజు వృత్తివిద్యకు సంబంధించి పలు రంగాలలో ఉపాధి అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి. నేటికాలంలో ప్లంబర్‌కు, కార్పెంటర్‌కు, ఎలక్ట్రీషియన్‌లకు, పెయింటర్‌కు, బేల్దారికి... ఇలా వృత్తి విభాగాలలో నైపుణ్యం వున్న వారికి డిమాండ్ వుంది. ఈ రంగాలలో నైపుణ్యం వున్న వారికి ఆర్థికంగా కూడా ప్రయోజనాలుంటాయి. వృత్తి విభాగాలలో యువతలో నైపుణ్యం పెంచేందుకు కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి కౌశల్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది.

ఈ పథకంలో ఏఏ కోర్సులున్నాయి, నిరుద్యోగులకు ఎలాంటి అవకాశాలున్నాయి అనే విషయాన్ని హైదరాబాద్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోలార్ పవర్ టెక్నాలజీస్ అండ్ వొకేషనల్ ట్రైనింగ్' మేనేజింగ్ పార్టనర్ వంశీకృష్ణ 'లాయర్'కు వెల్లడించారు. ఈ పథకం క్రింద పదో తరగతి పాస్ అయిన వాళ్లకు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, పెయింటర్, బేల్దారి వంటి 20విభాగాల్లో శిక్షణనిస్తున్నాం. ఈ పథకం క్రింద ప్రతి విద్యార్థికి శిక్షణ ఫీజు 7,500రూపాయలు, పరీక్ష ఫీజు 1200 రూపాయలు తీసుకునేవాళ్ళం. కాని ఇప్పుడు మా సెంటర్‌లో పరీక్ష ఫీజును మాత్రమే వసూలు చేస్తున్నాం. పరీక్షలో పాస్ అయిన విద్యార్థుల తరఫున కేంద్రమే 7,500రూపాయల ఫీజును మాకు చెల్లిస్తుంది. పరీక్ష తప్పిన విద్యార్థుల ఫీజును మా సంస్థే భరిస్తుంది. ఈ పథకం క్రింద శిక్షణా కేంద్రాన్ని నెల్లూరు, సుబేదారుపేటలో నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ కోర్సులలో శిక్షణనివ్వడం జరుగుతుంది. శిక్షణ తర్వాత కేంద్రప్రభుత్వ అధికారుల నేతృత్వంలోనే పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి కేంద్రప్రభుత్వం ద్వారానే సర్టిఫికేట్‌లు అందజేస్తారు. ఈ సర్టిఫికేట్ ఉంటే ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పదో తరగతి పాసైన నిరుద్యోగ యువతీయువకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంశీకృష్ణ కోరుతున్నారు. వివరాలకు 9705000089 నెంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# కబళించిన కరువు



*వర్షం లేకపోతే, ఏరు పారకపోతే, చెరువు నిండకపోతే, బావి ఎండిపోతే బ్రతుకంతా కరువే. కరువు రాకాసి జడలు విప్పి వికటాట్టహాసం చేస్తే మొదట నష్టపోయేది రైతే. కాని అదే కరువు కరాళనృత్యం కొనసాగితే రైతే కాదు, చివరకు రాజు కూడా నష్టపోవాల్సిందే! కష్టాల పాలుకావాల్సిందే. అందుకే అంటారు రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని.*

నెల్లూరుజిల్లాను కరువు కమ్మేసింది. గత కొన్నేళ్ల కాలాన్ని తీసుకుంటే ఎప్పుడూ లేనంత కరువు పరిస్థితి ఇప్పుడు జిల్లాలో నెలకొనివుంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు జిల్లా రైతాంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ప్రతి ఏటా కొంత విస్తీర్ణంలోనన్నా రెండో పంటకు అవకాశం ఉండేది. ఈ ఏడాది మాత్రం ఆ చిన్న అవకాశం కూడా లేకుండాపోయింది. గత కొన్నేళ్లుగా పెన్నానదికి వరదలే లేవు. కృష్ణాజలాలే జిల్లా రైతాంగానికి వరప్రసాదం. శ్రీశైలం నుండి తెచ్చుకున్న నీటితోనే సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను నింపుకుంటున్నాం. జిల్లాలో సాగునీటి, తాగునీటి అవసరాలు ఈ రిజర్వాయర్‌లే తీరుస్తున్నాయి. ఈ సంవత్సరం ఈ రెండు రిజర్వాయర్‌లలోనూ నీటి మట్టం అడుగంటిపోయింది. కండ్లేరు రిజర్వాయర్‌లో అయితే నీళ్లు అడుగంటిపోయి ఒకప్పటి ముంపు గ్రామాలు కనిపిస్తున్నాయి. మన దరిద్రంకొద్దీ ఈసారి కర్నాటకలోనూ పెద్దగా వర్షాలు లేవు. ఆ రాష్ట్రంలో వరదలొస్తేనే శ్రీశైలం డ్యాంలో నీళ్లొస్తాయి. అక్కడ వర్షాలు లేక శ్రీశైలం రిజర్వాయర్ కూడా ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో ఆ ఆశలు కూడా ఆవిరయ్యాయి.

ఆయకట్టు క్రింద వర్షాలను నమ్ముకుని వేసిన వేలాదిఎకరాలలో నీళ్లు లేక పైర్లు ఎండిపోయాయి. పశువుల మేత క్రింద రైతులు పైర్లను వదిలేసారు. అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించిన రైతులు ఎండిపోతున్న పంటలను చూసి అల్లాడిపోతున్నారు. ఇక వర్షాలు కురిసినా పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదు.

ఉదయగిరి వంటి మెట్టప్రాంతంలో అయితే కరువు చాలా దారుణంగా వుంది. నీళ్లు లేక వాణిజ్య పంటలు వేస్తుంటారు. ఒకట్రెండు వర్షాలు పడితే, ఈ పంటలు చేతికొస్తాయి. ఆ కొద్దిపాటి వర్షాలు లేక ఈ పంటలు ఎండిపోతున్నాయి. మెట్టప్రాంతంలో తాగునీటి కొరత తీవ్రంగా వుంది. కొన్ని గ్రామాల్లో అయితే ఎన్నడూ లేని విధంగా జనానికి ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందిస్తున్నారు. ఎప్పుడూ ఎండిపోని బావులు, బోర్లు కూడా ఈ ఏడాది ఎండిపోయాయి. పశువులను మేపే దిక్కు కూడా లేక కొందరు వీటిని నిలువునా అమ్మేస్తున్నారు. సెప్టెంబర్‌లో కూడా మే నెలను తలపించేలా కాస్తున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వంలో పరిపాలనా శూన్యత, రైతాంగాన్ని ఆదుకోవడంలో నిర్లిప్తత... ప్రకృతి, ప్రభుత్వం... రెండూ కూడా రైతన్నను ముంచేసాయి.

# కౌన్సిల్ సమావేశం పెట్టండి



నెల్లూరు నగరంలోని 54డివిజన్లలో బోలెడన్ని సమస్యలున్నాయని, వాటిని చర్చించేందుకు త్వరగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ నెల్లూరు నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ వైయస్సార్సీపి కార్పొరేటర్లతో కలిసి 11వ తేదీ నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. నగర ప్రజలు పడుతున్న పలు ఇబ్బందులపై చర్చించేందుకు వెంటనే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, ఎండి ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్, తదితర వైయస్సార్సిపి నాయకులు పాల్గొన్నారు.

# మంత్రిపై చిందులు తొక్కిన కిన్నెర

మంత్రి నారాయణపై 5వ డివిజన్ కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్ చిందులు తొక్కారు. 12వ తేదీన జిల్లా తెలుగుదేశంపార్టీ ఆఫీసులో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి విలేకరుల సమావేశం పెట్టారు. కిన్నెర ప్రసాద్ ఉన్నట్లుండి లేచి మంత్రి నారాయణ, మేయర్ అజీజ్ తనకు చెప్పాపెట్టకుండా తన డివిజన్లో పర్యటించారని, ఇదేం పద్ధతంటూ ప్రశ్నించారు. కార్పొరేటర్గా లక్షలు పెట్టి గెలిచాం, మాకిచ్చే విలువ ఇదా... అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన మంత్రి... అయిన వారికి ఆకుల్లో... కాని వారికి కంచాల్లో వడ్డిస్తున్నారు. ఇకనైనా మంత్రి తీరు మారకుంటే మా దారి మేము చూసుకుంటామంటూ ఆయన కేకలు వేయడంతో అక్కడున్న నాయకులంతా అవాక్కయ్యారు.

# రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మైథిలి విద్యార్థులు



నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో విశేష ప్రతిభ కనపరచి నెల్లూరు గాయత్రి నగర్లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. 11-14 సంవత్సరాల బాలికల విభాగంలో పావని, బాలుర విభాగంలో కె.భరత్కుమార్, 14-17 సంవత్సరాల విభాగంలో కునిల్, బి.వెంకటేష్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ బి.మనోహర్రెడ్డి, మైథిలిలు అభినందించారు.

# రూరల్ స్టేషన్లో ట్రైనీ ఐపిఎస్

జిల్లాలో ట్రైనీ ఐపిఎస్ ఆఫీసర్గా వున్న సిక్తాపట్నాయక్ సోమవారం నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్కు వెళ్లారు. అక్కడ కేసులు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదులు స్వీకరించడం, ఛార్జిషీట్లు, ఎఫ్ఐఆర్లు, అరెస్ట్ వంటి పోలీసు విధినిర్వహణ అంశాలను గురించి పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

# దీపం గ్యాస్ కనెక్షన్లు

నెల్లూరు నగర పరిధిలో దీపం పథకం కింద 29,300 గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయని టిడిపి నగర ఇన్ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తెలిపారు. 12వ తేదీ టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ నగరంలో 100గజాల్లోపు స్థలాన్ని ఆక్రమించి ఇంటిని నిర్మించుకున్న పేదలు డిసెంబర్ 15లోగా మీసేవ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీరికి పట్టాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నగర ఎమ్మెల్యే మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేయడం సబబుకాదని, ఆయన స్థాయి మరచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం నెల్లూరు నగరానికి మాత్రమే మంత్రి కాదని, రాష్ట్రానికి మంత్రి నారాయణ అని అన్నారు. హడ్కో నిధులపై తెలియకుండా మాట్లాడడం తగదన్నారు. ప్రత్యేకచొరవతో నగర కార్పొరేషన్కు భూగర్భ డ్రైనేజీ, వాటర్ పథకాల కోసం రూ.1100కోట్లు హడ్కో నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ జడ్.శివప్రసాద్, కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, కిన్నెర ప్రసాద్, పొత్తూరు శైలజ, మామిడాల మధు, దొడ్డపనేని రాజానాయుడు, టిడిపి నాయకులు చాట్ల నరసింహారావు, ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.



# సైకిల్ తొక్కిన ఎస్పీ

జిల్లా ఎస్పీ గజరావ్భూపాల్ ఈ నెల 12వ తేదీ ఉదయాన్నే తడలో సైకిల్ తొక్కి ప్రత్యేక ఆకర్షణయ్యారు. ముందురోజు ఆయన శ్రీసిటీలో జరిగిన పారిశ్రామిక సదస్సులో పాల్గొన్నారు. రాత్రికి అక్కడే భోంచేసి పడుకున్నారు. నిద్రలేవగానే వ్యాయామంలో భాగంగా శ్రీసిటీ నుండి 8కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ తడ పోలీసుస్టేషన్కు చేరుకున్నారు. ఎస్పీ సైకిలెక్కడంతో ఇంకొందరు పోలీసు అధికారులు కూడా సైకిళ్లను వెతుక్కుని మరీ ఆయన వెంట తొక్కారు.

# ఏఆర్ సిబ్బంది శ్రమదానం

నెల్లూరుజిల్లా పోలీసు కార్యాలయం వెనుకభాగంలోని సుమారు 100అడుగుల స్థలంలో 12వ తేదీ ఏఆర్ సిబ్బంది శ్రమ దానాన్ని నిర్వహించారు. ఇక్కడ ఏఆర్ సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు భవన నిర్మాణ పనులు చేపట్టారు. పది గదులు వచ్చేలా నిర్మిస్తున్నారు. జిల్లా ఏఆర్ విభాగంలో వివిధ హోదాల్లో సుమారు 900 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బందిలో ఎక్కువమంది హెడ్క్వార్టర్స్ లోనే అందుబాటులో ఉంటారు. ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా, వివిఐపిల పర్యటన, బందోబస్తులకు ఇక్కడ నుండే బయలుదేరుతారు. సరైన స్థలం లేకపోవడంతో పోలీసు కార్యాలయం ఆవరణంలో, టీ అంగళ్ల వద్ద కవాతు మైదానంలో ఉంటున్నారు. సిబ్బంది ఇబ్బందులను ఏఆర్ అధికారులు ఎస్పీ డాక్టర్ గజరావుభూపాల్, ఏఎస్పీ రెడ్డిగంగాధర్, సూరిబాబు దృష్టికి తీసుకుపోయారు. వారి అనుమతితో కార్యాలయం వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. సిబ్బంది స్వచ్ఛందంగా శ్రమదానం చేస్తూ భవనాన్ని నిర్మించుకుంటున్నారు.



# బ్యారేజీని తెమల్చండి

నెల్లూరులో పెన్నావారధిని అటూ ఇటూ కాకుండా చేసిపెట్టారు. పెన్నా బ్యారేజీని నిర్మిస్తున్న ప్రాంతంలో గతంలో ఆనకట్ట ఉండేది. దీని మీద మొన్నటిదాకా వాహనాల రాకపోకలుండేవి. వై.యస్. హయాంలో ఇక్కడ బ్యారేజీ పనులు మొదలుపెట్టారు. ఈ బ్యారేజీని మొదలుపెట్టిన ముహూర్తం బాగాలేదేమో అప్పటి నుండి కూడా పనులు నత్త నడకన సాగుతున్నాయి. దిగువన వున్న ఆనకట్ట మీద కూడా రాకపోకలు లేవు. బ్యారేజీ సమీపంలోని నీళ్లలో గుర్రపు డెక్క నిండిపోయి... ఇది నదిలా కాకుండా ఒక బురద మడుగులా అనిపిస్తోంది. ఇటీవలే నిలిచిపోయిన బ్యారేజీ పనులను మళ్లీ మొదలుపెట్టారు. తొందరగా పనులు పూర్తి చేసి దీనికొక రూపు తెస్తే బాగుంటుంది.

# నెల్లూరు కబుర్లు



# కళాక్షేత్రం మరమ్మత్తులకు చర్యలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ కస్తూర్బాకళాక్షేత్రాన్ని సోమవారం కలెక్టర్ యం.జానకి, జాయింట్కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్లు పరిశీలించారు. కళాక్షేత్రంలో కుర్చీలు, ఫ్యాన్లు, సీలింగ్ను చూసారు. కళాక్షేత్రంలో మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులతో చర్చించారు. కళాక్షేత్రంలో తాత్కాలిక మరమ్మత్తులు దండగ. ఈరోజు ఖర్చుపెట్టి చేసినా మళ్లీ సంవత్సరానికల్లా యథావిధిగా తయారై ఉంటుంది. దీనిబదులు మంచిదాతను పట్టయినా పూర్తిస్థాయిలో నేటికాలానికి తగ్గట్లుగా ఆధునీకరిస్తే మంచిది.

# నిమజ్జనం ఘాట్ వద్ద స్వచ్ఛభారత్



పెన్నానదిలో గణేష్ నిమజ్జనం జరిగే ఘాట్ల వద్ద ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. సింహపురి గణేష్ ఏకతా యాత్ర కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఏకతా కమిటీ సమన్వయకర్త సన్నపురెడ్డి సురేష్రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ను స్ఫూర్తిగా తీసుకుని గణేష్ నిమజ్జనం రోడు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కప్పిర శ్రీనివాసులు, అశోక్, వెంకటరమణయ్య, జయచంద్ర, చిలకపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రీత్ ఎనలైజర్ ఏది?!

నెల్లూరుజిల్లా పోలీసు కార్యాలయంలో బ్రీత్ఎనలైజర్ మాయమైంది. ఈ నేపథ్యంలో నాల్గవ నగర పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇటీవల రాష్ట్ర డిజిపి వెంకటరాముడు నెల్లూరులో పర్యటించారు. ఆ సమయంలో కృష్ణపట్నంపోర్టు యాజమాన్యం గుంటూరు రేంజ్కు తొమ్మిది బ్రీత్ ఎనలైజర్ పరికరాలను అందజేసింది. పోర్టు సిఇఓ అనిల్ డిజిపి చేతులమీదుగా పోలీసుశాఖకు అందజేశారు. ఆ బాక్సులను పోలీసు సిబ్బంది భద్రపరిచారు. అయితే రెండురోజులు క్రితం పోలీసు ఉన్నతాధికారులు వాటిని పరిశీలించగా తొమ్మిదికి బదులు ఎనిమిది దర్శనమివ్వడంతో దొంగకు తేలు కుట్టినట్లు విషయం బయటకు పొక్కకుండా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 11వ తేదీ నాల్గవ నగర పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు గప్చిప్ చేశారు. నెల్లూరులో మిస్సయిన బ్రీత్ ఎనలైజర్ హైదరాబాద్లో ఉందన్న సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్ళినట్లు సమాచారం.

# గుళ్లను దర్శించిన కలెక్టర్ దంపతులు

జిల్లా కలెక్టర్ యం.జానకి, ఆమె భర్త, విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ యువరాజ్లు ఆదివారం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అలాగే నరసింహ కొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి వెళ్లారు, ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

## పెరుగుతున్న అరాచకాలు

# పోలీసు అంటే భయం పోయిందా?

*పోలీసు అంటే భయముంటే రైళ్లల్లో పట్టపగలే దోపిడీలకు పాల్పడరు. పోలీసులకు దొరికితే మక్కెలిరిచి బొక్కలో తోస్తారనే భయం వుంటే పట్టపగలే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడరు. పోలీసుస్టేషన్ పట్ల భయం వుంటే దాడులకు, దౌర్జన్యాలకు, అరాచకాలకు దిగరు. మరి జిల్లాలో ఇటీవల దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు, ఇతర నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరీ పోలీసులంటే భయం లేకపోవడం వల్లే ఇలా జరుగుతున్నాయా?*

మొన్న హైదరాబాద్ నుండి గూడూరు వస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.మునిరత్నంపై దాడికి తెగబడి ఇద్దరు ఆగంతకులు ఆమె వద్ద వున్న నగలు అపహరించుకుపోయిన సంఘటన రాష్ట్రం లోనే సంచలనమైంది. రైళ్లలో భద్రత తీరుతెన్నులు ఎంత ఘోరంగా ఉన్నాయో ఈ సంఘటన తెలియజేస్తుంది. తన వ్యక్తిగత పని మీద చెన్నైకు వెళ్తున్న మునిరత్నం, చెన్నై వెళ్లే ట్రైన్ మిస్సయ్యి సింహపురి ఎక్స్‌ప్రెస్ ఎక్కేసి వికలాంగుల బోగీలో కూర్చుంది. దాదాపు నెల్లూరుకు వచ్చే సరికి ఈ ట్రైన్ అంతా కూడా ఖాళీ అవుతుంది. ఈ బోగీలో మునిరత్నం ఒక్కటే ఉండడాన్ని గమనించిన దుండగులు మనుబోలు సమీపంలో ఆమెపై దాడికి పాల్పడి, ఆమె వద్ద వున్న నగలను అపహరించి రైలు దూకి పారిపోయాడు. సమయానికి ప్రతి ఘటించడానికి ఆమె వద్ద సర్వీస్ రివాల్వర్ కూడా లేకపోవడంతో దుండగుల పని సులువైంది. ఇద్దరు దుండగులు ఆమె చున్నీతోనే మెడకు బిగించి, చేతులు కట్టేసి ముఖంపై కొట్టి ఆమె వద్ద వున్న నగలు తీసుకుని పరారయ్యారు. మునిరత్నం గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసారు. వారు వెంటనే ఆమెకు రైల్వే ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. మునిరత్నంది సూళ్లూరుపేట! నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో కూడా కొంతకాలం పనిచేసారు. కుటుంబ సభ్యులంతా చెన్నైలో ఉంటుండడంతో ఆమె నెలవురోజుల్లో చెన్నైకి వెళ్లేవాళ్లు. ఈ క్రమంలో 12వ తేదీ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది.



మునిరత్నంను పరామర్శిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

ఒక ఉన్నతాధికారిణికే రైలులో భద్రత లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితేం టనేది ఇప్పుడు కామన్ ప్రశ్న. భద్రత, అభద్రత అనేవి పోలీసులకు ఒకరకంగా, అధికారులకు ఒకరకంగా వుండవు. పోలీసు భయం అనేది సమాజంలో వుంటే దుర్మార్గులు బలిసినోళ్ల జోలికే కాదు, బలహీనుల జోలికి కూడా పోరు. బుద్ధిగా పనిచేసుకుని పోతారు. పోలీసులు పట్టుకునేది లేదు, పట్టుకున్నా మనల్ని పీకేదేమీ లేదనే ఉదాసీన వైఖరి ఇప్పుడు నేరగాళ్లలో ప్రబలంగా వుంది. గతంలో పోలీసు శాఖలో కొంతశాతం అవినీతి వున్నా అధికారుల్లో ఖాకీ పనితీరు చూపాలనే తపన, కసి ఉండేది.

ఇప్పుడు పోలీసు ఉద్యోగాలకు, బ్యాంకు ఉద్యోగాలకు పెద్ద తేడా లేకుండా పోయింది. డిపార్ట్‌మెంట్‌లోకి కొత్తగా వస్తున్నవాళ్లు ఎక్కడెక్కడ నేరగాళ్లున్నారు, ఏ ప్రాంతంలో ఎక్కువ నేరాలు జరుగుతుంటాయనే పాయింట్‌కంటే ఏ ప్రాంతం లాభదాయకంగా వుంటుందనే దాని మీద దృష్టి పెడుతున్నారు. ఇక నేరాలేం అదుపులోకి వస్తాయి? నేరగాళ్లెలా భయపడతారు?

# వినిపించబోతుందా...? రైలు కూత!



శ్రీకాళహస్తి – నడికుడి రైల్వేలైన్... మూడు దశాబ్దాల కల. ప్రతి ఏటా రైల్వే బడ్జెట్‌లో దీని గురించిన ప్రస్తావన రావడం, ఈ లైనును సర్వేలకే పరిమితం చేయడం పరిపాటిగా మారిపోయింది. ఈ లైన్ గురించి ఇప్పటికి ఎన్ని సర్వేలు చేసారో లెక్కేలేదు. ప్రతి ఏటా దీనికి సంబంధించిన అంచనా వ్యయం పెరిగిపోతూనే వుంది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఉండడం, కీలకమైన రైల్వేశాఖ పదవి ప్రాంతీయ పార్టీల చేతుల్లో ఉండడం, వాళ్లు రైల్వేబడ్జెట్‌లో తమ రాష్ట్రాలకు పెద్దపీట వేస్తూ ఇతర రాష్ట్రాల గురించి ఆలోచించకపోవడం వల్ల ఈ రైల్వేలైన్ ఇంతకాలం మరుగునపడిపోయింది.

మెట్టప్రాంతపు రైలు మార్గం ఇది. చిత్తూరుజిల్లాలో పాక్షికంగా, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో చాలా ఎక్కువ ప్రాంతాల్ని కవర్ చేసే లైన్ ఇది. ప్రయాణీకులకే కాదు, సరుకు రవాణాకు కూడా ఈ రైలు మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా తుఫాన్‌ల సీజన్‌లో చెన్నై – విజయవాడల మధ్య రైల్వే లైన్ దెబ్బతింటుంది. ఈ సమయంలో శ్రీకాళహస్తి–నడికుడి లైన్ ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే అవకాశం కూడా ఉంది.

ఇంతటి ప్రాధాన్యత గల లైన్ విషయంలో ఎట్టకేలకు కదలిక వచ్చినట్లుగా తెలుస్తోంది. రైల్వేలైన్ కోసం భూసేకరణ పనులు జరుగుతున్నాయి. జిల్లాలో వెంకటగిరి, డక్కిలి, రాపూరు, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, వింజమూరు, వరికుంటపాడు మండలాల పరిధిలో ఈ రైల్వేలైన్ కోసం భూసేకరణ మార్కింగ్ జరుగుతోంది. త్వరలో రైల్వేలైన్ నిర్మాణానికి టెండర్లు పిలువ వచ్చునని సమాచారం.

# భద్రతలో శ్రీసిటీ ఆదర్శం

## – నెల్లూరు జిల్లా ఎస్పీ గజరావు భూపాల్



భద్రత విషయంలో శ్రీసిటీని ఆదర్శంగా తీసుకోవాలని నెల్లూరుజిల్లా ఎస్పీ గజరావు భూపాల్ అన్నారు. నెల్లూరుజిల్లా తడ మండలం శ్రీసిటి బిజినెస్ సెంటర్‌లో 11వ తేదీ జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ పాల్గొని పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడుతూ పారిశ్రామిక ప్రగతితో పాటు భద్రతా ప్రమాణాలు అత్యంత ముఖ్యమన్నారు. సామాజిక కార్యక్రమాలతో పాటు స్థానికంగా వచ్చే ఇబ్బందులను తొలగించుకోవడంతో పాటు శాంతిభద్రతలను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. పరిశ్రమలకు సంబంధించి అసోసియేషన్‌గా ఏర్పడితే చాలా సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఏదైనా చట్టపరమైన సమస్యలు ఏర్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన 90మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రెడ్డి గంగాధరరావు, ట్రైనీ కలెక్టర్ సిక్తాపట్నాయక్, షార్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్ మనీష్‌సింగ్, శ్రీసిటి ప్రెసిడెంట్ సతీష్‌కామత్, గూడూరు, కావలి, నెల్లూరురూరల్ డిఎస్పీలు శ్రీనివాస్, రాఘవరావు, తిరుమలేష్‌రెడ్డి, నెల్లూరు ఎస్పీ డిఎస్పీ జయరామసుబ్బారెడ్డి, శ్రీసిటీ భద్రతాధికారి అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా యాత్రజిని వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు కేంద్రంగా కోమిట్ల రెనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రముఖ రవాణా సంస్థ యాత్రజిని. నాలుగు రాష్ట్రాలలో ప్రముఖ నగరాలు, పట్టణాలన్నింటిలోనూ యాత్రజిని సేవలు అందుతున్నాయి. అమెరికాలో ఉంటున్నప్పటికి రెనిల్‌కుమార్‌రెడ్డి ఈ దేశంలో పెట్టుబడులు పెట్టి ఒక పెద్ద రవాణా సంస్థను ఏర్పాటు చేసి వేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఇది చాలా గొప్ప విషయం. ఆదర్శవంతంగా నిలిచే పని. తమకు బ్రతుకుదెరువు చూపించిన తమ యజమాని రెనిల్‌కుమార్‌రెడ్డి పై తమకెంత అభిమానం వుందో ఆ సంస్థ సిబ్బంది కూడా చాటుకున్నారు. ఆదివారం యాత్రజిని ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు మరియు రెనిల్‌కుమార్‌రెడ్డి 40వ జన్మదినోత్సవ వేడుకలను నెల్లూరులోని కస్తూరి దేవి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. సిబ్బంది తమ బాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నగరంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కరెంటు



రెనిల్‌ను, ఆయన కుటుంబసభ్యులను సత్కరిస్తున్న సిబ్బంది

ఆఫీసు సెంటర్‌లోని కోమిట్ల కార్యాలయంలో 200మంది సిబ్బంది రక్తదానం చేశారు. నగరంలో క్యాబ్‌లు, బస్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. కస్తూరిదేవి గార్డెన్స్ వద్ద భారీ ఎత్తున బాణాసంచా కాల్చి తమ సంతోషం వ్యక్తం చేశారు. కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెనిల్ మాట్లాడుతూ తమ సంస్థలో 4రాష్ట్రాలలో 2వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, 5వ వార్షికోత్సవం నాటికి 5వేల మందికి ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు.

ఈ సందర్భంగా రెనిల్‌ను, కుటుంబ సభ్యులను సిబ్బంది గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెనిల్ తండ్రి కోమిట్ల సత్యనారాయణరెడ్డి కూడా పాల్గొన్నారు. యాత్రజిని ద్వితీయ వార్షి కోత్సవ వేడుకలను యజమానులు, సిబ్బంది కలిసి ఒక కుటుంబ పండుగలా చేసుకోవడం విశేషం.

# మిడ్‌నైట్ మంత్రి

## – ఎమ్మెల్యే అనిల్



నైట్ నెల్లూరుకు... ఎర్లీ మార్నింగ్ హైదరాబాద్‌కు... వాటీజ్ దిస్ నాన్సెన్స్ అంటూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణపై ఫైర్ అయ్యాడు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్. మంత్రి మీద ఫైర్ కావడం అనిల్‌కి ఇది మామూలే అయినా మంత్రి తన ధోరణిలో విని విననట్లు ఉండటం అతని స్టైల్. 11వ తేదీ నెల్లూరులోని నగర నియోజకవర్గ కార్యాలయంలో విలేకర్లతో అనిల్ మాట్లాడుతూ మంత్రి ఎప్పుడొస్తాడో అధికారులకు కూడా తెలియదనడం విడ్డూరంగా వుందన్నారు. నాలుగు నెలల క్రితం కార్పొరేషన్ సమావేశంలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, రాష్ట్రమంత్రి నారాయణ సమక్షంలో రెండు నెలల్లో హడ్కో నిధులు వస్తాయని అగ్రిమెంటు చేసుకున్నారని, ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. మంత్రి నారాయణ అర్ధరాత్రి పర్యటనలంటూ నాలుగురోడ్లు తిరిగి వెళ్లిపోవడం తప్ప, చేసిందేమీ లేదని, పగలు తిరిగితే సమస్యలపై నిలదీస్తారనే భయం నారాయణకు పట్టుకుందని ఎద్దేవా చేశారు. నెల్లూరులో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం, కుక్కల బెడదతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఊటుకూరు మాధవయ్య, ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేయొద్దు

బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తూ సంస్థను కాపాడాలని బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటనారాయణను కోరారు. ఈ నెల 14వ తేదీన ఆయన నెల్లూరు బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జిఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు క్రమంగా తగ్గిపోతున్నారు. ఉన్న వారికి కూడా సక్రమంగా సర్వీసు లేదు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులే కొందరు ప్రైవేట్ నెట్‌వర్క్‌లతో కుమ్మక్కై సంస్థను నాశనం చేస్తున్నారు. బిఎస్ఎన్ఎల్ బ్రాడ్ బ్యాండ్ కూడా ఘోరంగా ఉంది. ఎప్పుడు కనెక్ట్ అవుతుందో, ఎప్పుడు డిస్‌కనెక్ట్ అవుతుందో తెలియని పరిస్థితి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ దారుణంగా వుంటున్నాయి. కొన్ని గ్రామాల్లో కరెంట్ పోతే బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్లు, సెల్‌ఫోన్లు, బ్రాడ్‌బ్యాండ్ పని చేయడం లేదు. వెంటనే టవర్లు ఏర్పాటు చేసిన అన్ని చోట్లా ఆటోమేటిక్ జనరేటర్లను ఏర్పాటు చేసి వినియోగదారులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆయన జిఎంను కోరారు.

# నేస్తం ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం



ఈ నెల 15న నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధి సెమినార్ హాల్‌లో నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ కార్యక్రమాలకు తమవంతు సహకారాన్ని అందిస్తూ సంస్థ పురోగతికి తోడ్పడుతున్న నేస్తం ఫౌండేషన్ వాలంటీర్లకు ఉత్తమ వాలంటీర్ల పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి హాజరై జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నెల్లూరు నగరంలో నేస్తం ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న మిగులు ఆహార పంపిణీ, రక్తదానం వంటి కార్యక్రమాలు స్ఫూర్తివంతంగా ఉంటున్నాయన్నారు. ముఖ్యంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా నెల్లూరు నగరంలోని వివిధ గోడలపై స్ఫూర్తిదాయక చిత్రాలను రూపొందించడం చాలా అభినందించ దగ్గ విషయమన్నారు. కస్తూరిదేవి బాలికల పాఠశాల ప్రాంగణ గోడలను చాలా త్వరితగతిన వీరు అందమైన స్ఫూర్తిదాయక చిత్రాలుగా మలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు కోరం ప్రవీణ్‌కుమార్, రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ కె.సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.పెంచలయ్య, యాక్ట్ టివి మేనేజర్ బ్రిగు శాసన్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి
# రోటరీ క్లబ్ సన్మానం



శ్రీనివాసులురెడ్డిని పూలమాలతో సన్మానిస్తున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన, ప్రక్కన రోటరీ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి

గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి భవనంలో ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు గుండ్రా శ్రీనివాసులురెడ్డికి సన్మానసభను రోటరీ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన హాజరై మాట్లాడుతూ పల్లెల్లోని పాఠశాలలే దేశ నిర్మాణానికి పునాదులని అన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసులురెడ్డి ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమని రోటరీక్లబ్ అధ్యక్షుడు అశోక్ చక్రవర్తి అన్నారు. శ్రీనివాసులురెడ్డిని ఘనంగా పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు శివకుమార్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, బి.సురేంద్రరెడ్డి, నాగేంద్రప్రసాద్, కె.మునిగిరీష్, డాక్టర్ సి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గం



విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

గూడూరులోని అంబేద్కర్ భవనంలో ఆదివారం రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల యూనియన్ -327 డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. డివిజన్ అధ్యక్షుడుగా జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసులు, మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడాలని, రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని తిరుపతి యూనిట్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజనల్ యూనియన్ అధ్యక్షుడు భాస్కరయ్య స్థానిక నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, కరీముల్లా, సుధా తదితరులు పాల్గొన్నారు.

# ప్రయోగాలతో మేధస్సు వృద్ధి

శాస్త్ర పరిజ్ఞానంతో రూపొందించే ప్రయోగాలు విద్యార్థుల్లో మేధస్సును పెంచేందుకు దోహదపడుతాయని గూడూరు ఉప విద్యాశాఖాధికారిణి మంజులాక్షి అన్నారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాలలో మూడురోజుల పాటు జరిగిన 5వ జిల్లా స్థాయి ఇన్స్‌పైర్ కార్యక్రమం 11వ తేదీతో ముగిసింది. పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను డివిజన్ పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో సందర్శించారు. చిన్నారులు ఆవిష్కరించిన ప్రయోగాలు ఎంతో ఆకట్టుకున్నాయి. బాలాయపల్లి హైస్కూల్ సైన్స్‌టీచర్ డి.లక్ష్మీదేవి సోలార్ ఇరిగేషన్ సిస్టమ్స్ విత్ సేవింగ్ వాటర్ సాయిల్ డ్రై ఆర్ వెట్‌విత్ సెన్సార్ అనే దానిమీద వారి విద్యార్థులు ప్రయోగాలు చేశారు. మొత్తం 562 ప్రయోగాల్లో పరిశీలకులు ఉత్తమ ప్రయోగాలుగా 57ఎంపిక చేశారు. వీరందరూ రాష్ట్రస్థాయిలో జరిగే విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొననున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపవిద్యాశాఖాధికారిణి మంజులాక్షి మాట్లాడుతూ ప్రతి శాస్త్రవేత్త చిన్నతనంలో ప్రయోగశాలల్లో భిన్న ఆలోచనలు, మేధస్సుకు పదును, నూతన విధానంతో ప్రయోగాలను చేశారన్నారు. అలాంటివారు దేశంలో పేరుప్రఖ్యాత లున్న శాస్త్రవేత్తలుగా ఎదిగారన్నారు. రాష్ట్ర పరిశీలకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగున్న తెలివితేటలను వెలికి తీయడానికి ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రయోగాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ అకడమిక్ మానటరింగ్ అధికారి హమీద్ పలువురు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కాగా స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వచ్చి విద్యార్థుల ప్రతిభను, సైన్స్‌ఫేర్‌ను పరిశీలించి అభినందించారు.



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

### సమస్యల పరిష్కారమే
# బీసీ జనసభ ధ్యేయం



బీసీ జనసభ పోస్టర్లను విడుదల చేస్తున్న కార్యదర్శి ఎస్ఎస్ యాదవ్, ప్రక్కన మయూరి శ్యాంయాదవ్ తదితరులు

రాష్ట్రంలోని బీసీ కులాల సమస్యల పరిష్కారమే బీసీ జనసభ ధ్యేయమని బీసీ జన సభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్ఎస్ యాదవ్ తెలిపారు. స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో ఆదివారం నాడు బీసీ జనసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని అన్ని బీసీ కులాలకు చెందినవారంతా సంఘటితం కావాలన్నారు. ఈ క్రమంలో విజయవాడలో ఈ నెల 20న రాష్ట్ర కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో బీసీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు మయూరిశ్యాంయాదవ్, ఎల్‌వి సుబ్బయ్య, దామోదర్‌లు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు సహకరించండి
### - మున్సిపల్ చైర్‌పర్సన్ దేవసేన

గూడూరు పట్టణంలోని కాలనీల్లో ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించి చెత్తను రోడ్లపై వేయకుండా పురసిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలని చైర్‌పర్సన్ దేవసేన అన్నారు. గూడూరులోని 6వ వార్డులో ఆమె ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల దరఖాస్తు చేసుకున్నవారి ఇళ్లను పరిశీలించి నిర్మాణానికి స్థలాలు అనువుగా వున్నాయా, లేవా తెలుసుకున్నారు. రూ.200లకే మంచినీటి కొళాయిలు తెల్లరేషన్ కార్డు వున్నవారికి మంజూరు చేస్తారని, వాటికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దీంతో స్థానికులు వారి సమస్యలను ఆమెకు విన్నవించారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోదకొండ, వార్డు కౌన్సిలర్ మస్తానయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పిఆర్ క్లబ్ నూతన కార్యవర్గం

గూడూరు పిఆర్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఇటీవల జరిగింది. అధ్యక్షుడుగా దువ్వూరు రామలింగారెడ్డి, ప్రధానకార్యదర్శిగా యల్లసిరి గోపాల్‌రెడ్డి, కోశాధికారిగా టి.శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులుగా పులిమి శ్రీనివాసరావు, దండు మస్తాన్‌రెడ్డి, కె.రమణారెడ్డి, తూపిలి శ్రీనివాసులు, వల్లూరు అనంత పద్మనాభరెడ్డి, బల్లవోలు రఘునాథరెడ్డి, సేగు లక్ష్మీనారాయణబాబు, ఎ.శ్రీనివాసులు, పర్రి జనార్ధన్, ఎన్.శ్రీనాథ్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక రిటర్నింగ్ అధికారి బి.రవీంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.




## తృతీయ వర్ధంతి

మా తల్లి గారైన
**శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు**
దైవ సన్నిధి చేరి 3సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచేవుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి
కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

స్వర్గీయ శ్రీకంటి సుబ్బరత్నమ్మ గారు
W/o లేట్ ఎస్.వి.రత్నం గారు
కవి & ఆడిటర్, గూడూరు.

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
|---|---|
| శ్రీకంటి నాగరాజరావు - మాలతి | కారుమంచి ఇందిర - అనంతపద్మనాభరావు |
| శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి | యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు |
| శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ | మద్దాలి వసుప్రద - వెంకట కృష్ణారావు |
| | మరియు మనుమలు, మనుమరాండ్రు |




పూర్వపు విద్యార్థులతో గూడూరు నారాయణ కళాశాల సిబ్బంది

# బక్కచిక్కిన బొజ్జ గణపయ్య

శ్రీను గల్పిక

అది కైలాసం. శివుడు, పార్వతిలు టీవీ పెట్టుకుని 'కొట్టిన పెళ్లాం - ఏడ్చిన మొగుడు' సీరియల్‌ను చాలా ఆసక్తిగా చూస్తున్నారు. అంతలో నారాయణ, నారాయణ అంటూ నారద మహర్షి అక్కడకు వచ్చాడు. ఆయన మెడలో తంబూరా బదులు గిటార్ వుంది. శివుడు ఆశ్చర్యంగా... ఇదేంటి మహర్షి... ఈ పరికరం చాలా వింతగా వుంది, మీ తంబూరా ఏమైంది అని అడిగాడు. నారదుడు... ఇది లేటెస్ట్ మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్ ప్రభూ... వాయించడానికి చాలా సులభంగా వుందని అంటూ... ఇంతకీ టీవీలో ఏం సీరియల్ చూస్తున్నారని అడిగాడు. 'కొట్టిన పెళ్లాం - ఏడ్చిన మొగుడు' అని నవ్వుతూ శివుడు చెప్పాడు. వెంటనే నారదుడు... చూడమ్మా, ఆ సీరియల్ పేరు ఎంత ఆనందంగా చెబుతున్నారో, అంటే మీరు కూడా ఆయనను కొడుతున్నారనేగా మనసులో అనుకునేది అని అగ్గిపుల్ల గీసాడు. వెంటనే శివుడు ఆయన రెండు చేతులు పట్టుకుని... స్వామీ, మీకు ఏ వరం కావాలంటే ఆ వరం ఇస్తాను, నా కాపురంలో చిచ్చు పెట్టొద్దు, మీకు ఆహారం కావాలంటే కొద్దిసేపు ఈ సీరియల్ చూడండి, సీరియల్ అంతా కలహాలు, గొడవలే... మీకు కడుపు నిండిపోతుందన్నాడు. నారదుడు జాలిపడి వదిలేసి... ఇంతకీ మీ పుత్రరత్నాలు కుమారస్వామి, వినాయకుడెక్కడ అని అడిగాడు. కంప్యూటర్ క్లాసులకు వెళ్లారు అని శివుడు అంటుండగానే మమ్మీ... డాడీ అంటూ కుమారస్వామి, వినాయకుడులు పరుగెత్తుకుంటూ వచ్చారు. నారదుడు వారిని చూసి... బాగానే ఇంప్రూవ్ అవుతున్నారని... ప్రభు, మీ పిల్లలిద్దరికీ ఓ పరీక్ష పెట్టదలిచాను, వాళ్లకు ఇది టాలెంట్ టెస్ట్. ఎవరి శక్తి ఏంటో తెలుస్తుందన్నాడు. శివుడు అందుకు ఓకే అంటూ ఆ టెస్ట్ ఏంటో చెప్పమన్నాడు. ఈ విశ్వాన్ని ఎవరు ముందుగా చుట్టి వస్తే వాళ్లు విజేతలని చెప్పాడు. శివయ్య ఓకే అన్నాడు. పార్వతీదేవికి ఏ బిడ్డ గెలుస్తాడో చూడాలని ఆసక్తిగా వుంది. నారదుడు గిటార్ వాయించి పోటీని ప్రారంభించాడు. కుమారస్వామి తన నెమలి వాహనమెక్కి 500కిలోమీటర్ల వేగంతో విమానంలా దూసుకెళ్లాడు. పోటీ గురించి ముందుగానే తెలుసుకున్న ఎలుక తనకు దోమలు కరిచి డెంగ్యూ జ్వరం వచ్చిందని ముసుగుతన్ని పడుకుంది. వినాయకుడు ఒక్క నిముషం ఆలోచించాడు... వెంటనే శివుడు, పార్వతిల చుట్టూ ఓ రౌండ్ తిరిగి... మాతృ, పితృదేవతలారా... మీ చుట్టూ ఓసారి తిరిగానంటే... ఈ విశ్వాన్ని వందసార్లు చుట్టినట్లే నన్నాడు. ఆ మాటతో శివ, పార్వతులకు కళ్లు చెమర్చాయి. నారదుడు కలుగజేసుకుని నీలో అమాయకత్వం ఇంకా పోలేదు శివయ్యా, నీ భోళాతనం వల్లే రాక్షసులు వరాలు పొంది దేవతలు నానా అగచాట్లు పడ్డారు. పొగడగానే ఇలా పొంగిపోతే ఎలా... వినాయకుడు మిమ్మల్ని సెంటిమెంట్‌తో పడేసాడు. మీ గణపయ్యకు పొట్ట ఎక్కువ... దాన్నేసుకుని పరుగెత్తలేడు. ఆ ఎలుక ఆయనను మోయలేదు. అనవసర ప్రయాస ఎందుకని వినాయకుడు ఒక్క మాటలో మిమ్మల్ని పడేసాడు. అమాయక కుమారస్వామి మాత్రం నెమలి నేసుకుని ఎగురుకుంటూ పోయాడు. అదీగాక రేపు భూలోకంలో వినాయకచవితి. ఈయన లోకాలను చుట్టడానికి పోతే అక్కడ ఉండ్రాళ్లన్నీ ఎవరు తింటారు. అందుకే రేపు భూలోకం పోవడానికే ఈ ఎత్తు వేసాడన్నాడు. నారదుడి మాటలకు శివ పార్వతులు ఇంకా మురిసిపోతూ... మా బుజ్జి గణపయ్యకు అప్పుడే పొట్టనిండా తెలివి అనుకున్నారు. తర్వాత వినాయకుడు తన తల్లిదండ్రులకు చెప్పి వినాయకచవితి కోసం భూలోక ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అప్పుడు పార్వతీదేవి... నాయనా, భూలోకంలో జాగ్రత్తగా ఉండు. పొరపాటున సిరియా అనే దేశం వెళ్లేవు... అక్కడున్న వాళ్లే ఇతర దేశాలకు వలసపోతున్నారు. థాయ్‌లాండ్ తైవాన్ వంటి దేశాలకు పోకు... అక్కడ సంస్కృతి మనకు పడదు. చైనా, హాంకాంగ్‌లకు వెళ్లకు... అక్కడ నీకు ఉండ్రాళ్లు కాదు కదా, గుండ్రాళ్లు కూడా దొరకవు. పైగా నీ ఎలుకను చూసారంటే, దానిని పట్టుకెళ్తారు. నువ్వు నేరుగా ఇండియాలోనే దిగు. అయితే జమ్మూ కాశ్మీర్‌లో మాత్రం అడుగుపెట్టకు. అక్కడ తుపాకుల మోత ఎక్కువుగా వుంది. నువ్వు వెళితే ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వెళ్లు. ఈమధ్య అక్కడ అమరావతి సింగపూర్ రాజధాని కట్టారంట... మెట్రో రైళ్లు, సైబర్ పార్క్‌లు, కారిడార్‌లు... ఆ రాష్ట్రం ఎంతో చూడముచ్చటగా వుందని, ప్రజలు చంద్రబాబు పాలనలో సుఖసంతోషాలతో ఉన్నారని 'ఏబిసిడి', బి టీవీలలో చెపుతుండగా చూసాను. కాబట్టి భూతల స్వర్గమైన ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి వినాయకచవితిని ఎంజాయ్ చేసిరా నాయనా... బెస్టాఫ్ లక్ అంటూ పార్వతీదేవి సాగనంపింది.

★★★★★

పదిరోజులు గడిచాయి. వినాయకచవితి పండుగ చూసుకుని పక్కరోజే వస్తానన్న గణపయ్య వారంరోజులైనా రాకపోయే సరికి పార్వతీదేవిలో ఆందోళన మొదలైంది. గణపయ్య ఎక్కడున్నాడో కనుక్కోమని శివుడిని సతాయించసాగింది. గణపయ్య వచ్చేదాకా తిండి తిప్పలు లేవంటూ శివయ్యను కూడా ఎండబెట్టసాగింది. ఆకలి బాధ పడలేక వినాయకుడిని పట్టుకుని రమ్మని శివుడు కొందరు భటులను పంపించాడు.

★★★★★

వారం తర్వాత... శివయ్య, పార్వతీదేవిలు దిగులుగా వుండగా... అమ్మా, నాన్న... అనే పిలుపు వినిపించింది... ఇద్దరూ అటువైపు చూసారు. ఎదురుగా బక్కచిక్కిన గణపయ్య... బొజ్జ ఒక్క అంగుళం కూడా లేదు. పార్వతీదేవి బాధతో... ఏంటి నాయనా, ఇలా అయ్యావు. భూలోకంలో ఎక్కడన్నా జిమ్‌లో చేరి ఎక్సర్‌సైజ్‌లు చేసావా... ఎందుకిలా చిక్కిపోయావని అడిగింది. అప్పుడు గణపయ్య చెప్పడం మొదలుపెట్టాడు. అమ్మా, నువ్వు చెప్పినట్లే ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాను. కాని అది భూతలస్వర్గంలా కాదు... భూతల నరకంలా వుంది. రైతుల భూములను లాక్కుంటున్నారు, నీళ్లు లేక పంటలు లేవు, రైతులు నాలాగే బక్కచిక్కిపోయారు. రైతులంతా కష్టాలు పడుతున్నారు. వినాయకచవితి రోజు ప్రసాదాలు పెట్టే స్థోమత కూడా వారికి లేదు. వారి పరిస్థితి చూసి నాకే బాధేసింది. నువ్వు సిరియా వెళ్లొద్దన్నావ్, చైనా, జమ్ముకాశ్మీర్‌లకు వెళ్లొద్దన్నావ్... ఇక్కడే ఒక మిస్టేక్ చేసావ్... నెల్లూరుకు మాత్రం వెళ్లొద్దని చెప్పలేదు. నేను కూడా రాజకీయ నాయకులు 'సుందర సింహపురి' అని టీవీలలో చెబుతుంటే... ఆ ఊరు ఎలా వుంటుందో చూద్దామని వెళ్లాను. ఆ నగరంలో ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు కరవడంతో డెంగ్యూ జ్వరం వచ్చింది. వారంరోజులు సింహపురి ఆసుపత్రి ఐసియులో వున్నాను. మన భటులు వెతుక్కుంటూ వచ్చి నన్ను డిశ్చార్జ్ చేసి తీసుకొచ్చారని, నేను ఇలా బక్క చిక్కడానికి డెంగ్యూ జ్వరమే కారణమని చెప్పాడు. అది విని పార్వతీ దేవి... అయ్యో, బిడ్డా... నీకు నెల్లూరు గురించి చెప్పడం మరచిపోయి ఎంత పొరపాటు చేసానని బాధపడసాగింది.

---

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక సర్దుబాటులందు కొంత తేడాలుంటాయి. ఆదాయము తగ్గుతుంది. బంధువర్గంలో మీపై అసంతృప్తి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బిల్లులు ఆలస్యం కాగలవు. చిన్న పరిశ్రమలు, వ్యవసాయదారులకు ఆశాజనకంగా ఉండవచ్చును. శుభకార్యముల నిర్ణయాలు కాగలవు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఉద్యోగప్రయత్నాలు చేసేవారికి అనుకూలత ఉంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

స్థిరాస్తుల వ్యవహారాలు, ఋణ వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాల ప్రయత్నాలలోనున్న వారికి అనుకూలత బాగుంటుంది. ఇతరుల సలహాల కారణంగా పొరపాట్లు లేకుండా చూచుకొనండి. అనుకున్న పనులు వేగంగా జరిగి నెరవేరతాయి. ఒప్పందాలు చేసికొనేటప్పుడు జాగ్రత్త.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలు వేగం అందుకొని ఆదాయం పెరుగుతుంది. వర్కర్లతో యజమానులు జాగ్రత్త పడండి. ఉద్యోగులకు స్థానమార్పు, సమర్థత, గుర్తింపు గౌరవాలు లభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందులుంటే సర్దుబాటు కాగలవు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆర్థికంగా కొద్దిపాటి ఇబ్బందులుండినా అధిగమిస్తారు. బాగా శ్రమతీసికొంటే గాని పనులు జరగని పరిస్థితులుంటాయి. సంబంధము లేని విషయాలలో జోక్యం చేసికొనవద్దు. ఉద్యోగులకు అదనపుపనులు, స్థానమార్పులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఆలస్యం కావచ్చును.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలకు చెందిన ఆర్థిక విషయాలలో మీ అంచనాలు ఫలిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. ఆత్మీయులు బంధువులతో మనోభేదాలు రాకుండా సర్దుబాటు చేసికొనండి. ఇంటి రిపేర్లు వస్తు వాహన రిపేర్లుంటాయి. అనుకున్న పనులు హడావిడిగా జరుగుతాయి. సభలు, సమావేశాలలో మీ పరిజ్ఞానము, మాట నేర్పరితనంతో మన్నన పొందుతారు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పన్నులు, చెల్లింపులు ఇతరాలవి సకాలంలో చెల్లించగలరు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికై అవకాశాలు దొరకగలవు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. కాబట్టి ఖర్చులు పెరిగినా సమస్య ఉండదు. విద్యా ప్రగతి బాగుంటుంది. శుభవార్తలు వింటారు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. సోదరులు, బిడ్డలతో విభేదాలు రాకుండా చూచుకొనండి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 18.09.2015 నుండి
తేది. 24.09.2015 వరకు

ఈ వారంలో మీనంలో కేతువు, కర్కాటకంలో శుక్రుడు, సింహంలో కుజ గురువులు, కన్యలో రవి బుధ రాహువులు, వృశ్చికంలో శని, తుల వృశ్చిక ధనుర్మకరములందు చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
కన్యా భాద్రపదము శూన్యమాసము

ముహూర్తములు లేవు.

**భాద్రపద శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | పంచమి | రా॥ గం.7.48వ॥ |
| తేది. 19 | శని | షష్ఠి | రా॥ గం.8.41వ॥ |
| తేది. 20 | ఆది | సప్తమి | రా॥ గం.9.01వ॥ |
| తేది. 21 | సోమ | అష్టమి | రా॥ గం.8.53వ॥ |
| తేది. 22 | మంగళ | నవమి | రా॥ గం.8.12వ॥ |
| తేది. 23 | బుధ | దశమి | రా॥ గం.7.06వ॥ |
| తేది. 24 | గురు | ఏకాదశి | సా॥ గం.5.34వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఖర్చులు పెరుగుతాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి రాబడి ఉంటుంది. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చు. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. పెండింగ్‌లో గల సమస్యలు సర్దుబాటు కావడం, దూరం నుండి ఆహ్వానాలు అందుకొనడం, ఉద్యోగులకు వ్యాపారులకు అధికారుల వల్ల చిక్కులుంటాయి. ఋణాలు చెల్లింపులు తప్పక జరుపుతారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వ్యాపారాలలో వృత్తి జీవనంలో పురోభివృద్ధి బాగుంటుంది. బాంధవ్యాలు బలపడతాయి. భాగస్వామిక వ్యాపార అవకాశాలు లభించగలవు. శుభకార్యాలకు సమయం నిర్ణయం కాగలదు. సభలు, సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఆర్థిక స్థిరాస్తుల లావాదేవీలందు మేలు జరుగుతుంది. చిన్నచిన్న ఆటంకాలుండినా అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్త్రీలకు అనారోగ్య సమస్యలుండగలవు. నిర్మాణదారులకు, కాంట్రాక్టర్లకు ఆర్థిక సమస్యలుంటాయి. వస్తు వాహన రిపేర్లు, పలుకుబడి కోసం చేసే ఖర్చులు పెరుగుతాయి. వ్యవసాయదారులకు ఋణాలు లభించ గలవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం అభివృద్ధి బాగుంటుంది. వ్యవహారాలో తగిన నిర్ణయాలు తీసికొని లాభాపడతారు. వివాహాది శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థికస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. అనుకోని అదనపు ఖర్చులు ఇబ్బంది పెడతాయి. వ్యాపారరీత్య అవకాశాలు తగ్గి సామాన్య ఆదాయముంటుంది. పనులు సక్రమంగా జరుగక చికాకు పడతారు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. వృత్తి ఉపాధి రంగాలు సామాన్యంగా జరుగుతాయి. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై ఆందోళనగా ఉంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారవృద్ధికి అవకాశాలు చేజారిపోతాయి. ఆదాయము సామాన్యము. బంధువులతో పేచీలు రావచ్చును. వస్తు వాహన రిపేర్లు చిన్నచిన్న గృహరిపేర్లుంటాయి. అప్పులు ఇవ్వడం, హామీలివ్వడం చేయవద్దు. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. మాటల్లో గాని చేతల్లో గాని తొందరపాటు ప్రదర్శించవద్దు. షేర్లు నిరుత్సాహపరుస్తాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఇంటి వ్యవహారాలను, ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. తొందరపడి నిర్ణయాలు తీసికొనవద్దు. వృత్తి వ్యాపారాలలో రాబడి సంతృప్తికరము. అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కావడం, పెండింగ్ వ్యవహారాలలో సంప్రదింపులు జరుపుతారు. షేర్ల మీద లాభాలుంటాయి.

## కావలి కబుర్లు



# బకింగ్‌హామ్ కాలువ బాగుపడేనా?

### • తీరప్రాంత వాసుల కల నెరవేరేనా?

బకింగ్ హామ్ కాలువ బాగుపడే పరిస్థితులు కనపడడం లేదు. బ్రిటీష్‌కాలం నాటి ఈ కాలువకు పూర్వవైభవం తెస్తామన్న యూపిఏ ప్రభుత్వం గతంలో పార్లమెంటులో ప్రకటన చేసినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. 19వ శతాబ్దంలో బ్రిటీష్ ప్రభుత్వ రోడ్డు రవాణా కంటే జల రవాణా ద్వారా సులభంగా వస్తువులను రవాణా చేయవచ్చని ఈ కాలువ ద్వారా రవాణా చేసింది. అయితే తరువాత కాలువ ఆక్రమణలకు గురైంది. దినికి తోడు ఆక్వా రంగం అభివృద్ధి చెందడంతో ఈ కాలువ మరింత ఆక్రమణలకు గురైంది. రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతమున్న మోడీ ప్రభుత్వం 2018 నాటికి బకింగ్‌హామ్ కాలువను పూర్తి స్థాయిలో ఆధునికరించేందుకు పార్లమెంటులో ప్రకటించింది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలువ ఆధునీకరణకు అవసరమైన చర్యలు చెప్పడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ఆక్రమణలకు గురైన కాలువ భూములకు రెవెన్యూశాఖ అధికారులు అధికారిక పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. దీనితో కాలువ భూములను తిరిగి ప్రభుత్వం తీసుకొనేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాకినాడ నుండి పాండిచ్చేరి వరకు ఉన్న ఈ కాలువ సుమారు 1150కిలోమీటర్ల పొడవు విస్తరించి వుంది. ప్రస్తుతం 80 అడుగులు వెడల్పు వున్న ఈ కాలువను 140 అడుగులు విస్తరణ చేసేందుకు ప్రభుత్వం విజయవాడలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. అయినా సర్వే పనులు నత్తనడకన జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప ఆచరణలో సాధ్యాసాధ్యాలపై సమన్వయం లేక పనులు ప్రారంభం కాలేదు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ఆక్రమణలు గుర్తించినప్పటికీ వాటిని తొలగించే పరిస్థితి కనపడడం లేదు. ఈ కాలువ ఆధునీకరిస్తే కాకినాడ నుండి తమిళనాడు, పాండిచ్చేరి వరకు జలరవాణా ద్వారా తక్కువ ఖర్చుతో మత్స్య సంపద రవాణా చేయవచ్చని ప్రభుత్వం భావిస్తుంది. అదే విధంగా కాలువ సమాంతరంగా 40 అడుగుల రోడ్డును కూడా నిర్మించాలని ప్రతిపాదన వుంది. దీనివల్ల సాగరంలో మత్స్యకారులు పట్టుకున్న చేపలు సకాలంలో రవాణా చేయడం ద్వారా మంచి ఆదాయం వచ్చే పరిస్థితులున్నాయి. కాని ప్రభుత్వాలు పరిశ్రమలు, విమానాశ్రయాలు, పోర్టులపై పెట్టిన శ్రద్ధ బకింగ్ హామ్ కాలువపై చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బకింగ్‌హామ్ కాలువకు మోక్షం ప్రసాదించి మత్స్యకారుల జీవితాలలో వెలుగు నింపేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# జగన్‌ను కలిసిన ప్రతాప్



కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం బెంగుళూరులో వైయస్సార్సీపీ అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డిని కలిసి పలు విషయాలు చర్చించారు. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న సాగునీటి సంఘం ఎన్నికల గురించి చర్చించారు. ప్రభుత్వ వైద్యశాలల అభివృద్ధి కమిటి ఛైర్మన్లుగా శాసనసభ్యులను తొలగిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెం.48 మీద హైకోర్టులో యధాతథ స్థితి కొనసాగించేలా ఉత్తర్వులు తెచ్చిన విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేశారు. అలాగే కావలి నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను గురించి ఎమ్మెల్యే జగన్‌కు వివరించారు.

# విద్యార్థినులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



హాస్టల్ విద్యార్థినులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డా॥ పూనూరు వెంకారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ నందు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు రక్త నిర్ధారణ పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పక విద్యార్థినులు వైద్యపరీక్షలకు హాజరుకావాలన్నారు. అదేవిధంగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాలు తీర్చుకొని శుభ్రంగా స్నానం చేయడం వలన చర్మవ్యాధులను దూరం చేయవచ్చన్నారు. కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించడం వల్ల ఆరోగ్యంగా, ఉల్లాసంగా జీవించవచ్చన్నారు. విద్యతో పాటు ఆట, పాటలలో పాల్గొని తమ ప్రతిభను వెలికితీసే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. రక్తం గ్రూపులను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలన్నారు. ఎవరికైనా రక్తం ఇవ్వవలసిన అవసరం వస్తే రక్తం గ్రూపు తెలియకపోతే ఇబ్బందులు పడతారన్నారు. రక్తదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి తోటి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. ఎంఆర్‌పిఓ ఆర్.వి. నరసారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు రక్త గ్రూపు వివరాలు తెలుసుకుని గ్రామంలో వున్న తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రతినిధులు పద్మావతి, హరీష్‌కృష్ణ, ఏఎన్ఎంలు, వార్డన్‌లు భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గిరిజన కాలనీకి విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తా

**- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి**



కావలి పెద్దచెరువు సంఘం గిరిజన కాలనీవాసుల సౌకర్యార్థం విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి త్వరలో విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తానని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. పెద్దచెరువు సంఘం గిరిజన కాలనీవాసులు సి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి వారి సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక విషసర్పాలు, క్రిమికీటకాల బారిన పడుతున్నామని, విషసర్పాల ద్వారా పలువురు కాలనీవాసులు మృతిచెందినట్లు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాలనీకి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి, విషసర్పాల బారి నుండి రక్షణ కల్పిస్తామన్నారు.

# ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలి

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు పేదప్రజలకు అందేలా కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, కావలి డివిజన్ కార్యదర్శి దేగా సత్యంలు స్థానిక శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ పథకాల అమలు, అవి నిరుపేదలకు అందించేందుకు చేయాల్సిన కార్యాచరణలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో, నియోజకవర్గంలో వైకాపా చేసే పోరాటాలకు సిపిఐ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కె.శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి పి.కామరాజు, సిపిఐ నాయకులు బి.వెంకటేశ్వర్లు, వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు.

# చెట్టుకు చేటుతెచ్చిన వాస్తు



రక్షించవలసిన వారే భక్షకులుగా మారితే... ఇంక ఎవరికి చెప్పాలి... అనే విధంగా ప్రభుత్వాలు కోట్లు ఖర్చుపెట్టి మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుడుతుంటే, అందుకు భిన్నంగా 1వ పోలీస్ స్టేషన్‌లో వున్న చెట్లను నరికించిన సంఘటన సోమవారం జరిగింది. వృక్షోరక్షతి రక్షితః అని విస్తృత ప్రచారం జరుగుతున్న సందర్భంలో ఎన్నో సంవత్సరాలుగా పెరిగిన చెట్లను వాస్తు దృష్టితో నరికించడం బాధాకరం. చదువుకొని ఉన్నత స్థానంలో వున్న అధికారులు అవగాహన కల్పించవలసింది పోయి, చెట్లను నరికించడం విడ్డూరం. పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సింది పోయి పెరిగిన చెట్లను తొలగించడం వలన లాభమేమిటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు మొక్కల పెంపకంపై అర్థం చేసుకుని చెట్లను రక్షించవలసిన అవసరం వుంది.

## శ్రీకాళహస్తి న్యూస్

# దేవాలయాభివృద్ధే... పట్టణాభివృద్ధి

**- పాలకమండలి చైర్మన్**

దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఎట్టకేలకు మంగళవారం పాలకమండలి ఏర్పాటైంది. రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నేతృత్వంలో సోమవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయానికి ఫ్యాక్స్ ద్వారా సమాచారం అందింది. పేర్లు తారుమారు అవుతాయని ముందుగానే ఊహించినట్లు రెండు పేర్లు మారాయి. దాంతో ట్రస్టుబోర్డు చైర్మన్‌గా పోతుగుంట గురవయ్యనాయుడు, సభ్యులు కాసరం రమేష్, ఎం.లోకనాథ నాయుడు, ఎం.నారాయణ, ఎ.బాలాజీ, కె.సిద్ధులయ్య, వి.గుర్రప్ప శెట్టి, టి.మల్లికార్జునగౌడ్, శ్రీమతి ఎం.ప్రమీలమ్మ, సి.చిత్తమ నాయుడు, సి.జయగోపాల్, ఎం.చంద్ర, ఎం.వెంకట్రామనాయుడు, శ్రీమతి కంద్రిగ ఉమ, పి.సీతారామయ్య, ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా కె.సంబంధ గురుకుల్‌లచే పెండ్లి మండపం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రామిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సతీమణి బొజ్జల బృందమ్మ, కుమారుడు బొజ్జల సుధీర్, ఎం.ఎల్.సి. గౌరినేని శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.



ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పోతుగుంట గురవయ్య నాయుడు మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధి చెందితేనే పట్టణాభివృద్ధి జరుగుతుందన్నారు. 32 సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నాను, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిలు నా మీద నమ్మకం ఉంచి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయాన్ని కాపాడాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. దళారుల వ్యవస్థను అరికడుతామని, భక్తులకు కావాల్సిన కాటేజీలను నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మున్సిపల్ ఛైర్మన్ పేట రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నగరానికి ఏమైంది...?

(మొదటి పేజీ తరువాయి)

అవును... నెల్లూరుకి ఏమయ్యింది. ఎందుకిలా జరుగుతోంది. ఇంతటి నిర్లక్ష్యానికి ఎందుకు గురౌతోంది. ఇది ప్రస్తుతం ప్రతి నెల్లూరీయుడిని పట్టి పీడిస్తున్న ప్రశ్న. ప్రస్తుతం మార్చాల్సింది నెల్లూరు పేరు కాదు, నగర స్వరూపం. 13జిల్లాలతో కూడిన ఆంధ్రప్రదేశ్‌లో ఇంతటి ధౌర్భాగ్యమైన నగరం బహుశా ఒక్క నెల్లూరే కావచ్చు. ఎందరో మహాను భావులు పుట్టిన జిల్లా ఇది. ఎన్నో ఉద్య మాలకు ఊతమిచ్చిన జిల్లా ఇది. ఎందరో త్యాగధనులకు జన్మనిచ్చిన జిల్లా ఇది. అటు కేంద్ర స్థాయిలోనూ, ఇటు రాష్ట్ర స్థాయి లోనూ ఎందరో రాజకీయ ఉద్ధండులను అందించిన జిల్లా ఇది. మనుమసిద్ధి మహారాజు పాలించిన నేల ఇది. తిక్కన మహాకవి తన కలాన్ని నాట్యం చేయించి మహాభారతాన్ని రచించిన పునీత గడ్డ ఇది. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసిన భూమి ఇది. యావత్ ప్రపంచం లోనే వరి సాగులో నెల్లూరుకు లేదెక్కడా సరి అనిపించుకున్న ధాత్రి ఇది.

మరి ఎందుకిప్పుడిలా దాపురించింది. జిల్లా కేంద్ర స్థానమైన నెల్లూరుకు ఎందుకు పీడ పట్టింది. ఎలాంటి అభివృద్ధికీ నోచు కోకుండా ఎందుకు నిర్లక్ష్యానికి గురి కాబడుతోంది. కొత్త పథకాలు కొత్త ప్రణా ళికలు కొత్త నిధుల సంగతి దేముడెరుగు అసలు ప్రాథమిక వసతుల విషయంలో సైతం నెల్లూరు పూర్తిగా నిర్లక్ష్యానికి బలైపోయింది. చిన్నచిన్న విషయాలలో కూడా అధికార యంత్రాంగం మొద్దునిద్ర పోతోంది.

మునిసిపాలిటి, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, పిడబ్ల్యూడి, ఆర్ & బి, ఆర్‌టిపి వంటి శాఖలు అన్ని కలసి సమ న్వయంతో పని చేసి నగరాన్ని సుందర నగరంగా కాలుష్య రహిత పట్టణంగా అందమైన టౌన్‌గా తీర్చిదిద్దుకోవచ్చు. ఎ.వి.కృష్ణారెడ్డి వంటి మేధావులు ఎన్నో సందర్భాల్లో "సుందర సింహపురి" ప్రణాళికలని అధికారుల దృష్టికి తెచ్చినా అవన్నీ బుట్టదాఖలైయ్యాయే తప్ప ఎక్కడా అమలుకు నోచుకోలేదు. ఫైన్‌లతో సహా ఇంటిపన్నులు, కొళాయి పన్నులు వసూలు చేసే విషయంలో మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు చూపిస్తున్న శ్రద్ధ ఆసక్తి నగర అభివృద్ధి విషయంలో ఒక్క శాతం కూడా చూపించడం లేదు.

నగరంలో ఎక్కడ చూసినా చెత్తే. డస్ట్‌బిన్‌లు నిండిపోయి పొర్లిపోతున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఇక దోమల విషయానికొస్తే కోట్లలోనే వున్నాయి. కనీసం ఫాగింగ్ మిషన్ ద్వారా వారానికి ఒక్క సారైనా దోమల నివారణ ప్రయత్నం చేయడం లేదు. నగరంలోని ఎన్నో లే అవుట్‌లలో వందలకొద్దీ ఖాళీ ప్లాట్లు బురదనీటిలో నిండి పందులు, పంది కొక్కులు పొర్లాడుతున్నాయి. మాగుంట లే అవుట్ వంటి ఖరీదైన భవనాలున్న లే అవుట్‌లో అయితే పందులు, పందికొక్క లతో పాటు భయంకరమైన పాములు కూడా తిరుగుతుండడం గమనిస్తే ఈ నగరం ఎంతటి నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురికాబడిందో అర్థమైపోతుంది.

పట్టణమంతా ఎక్కడ చూసినా వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. ట్రాఫిక్ స్పీడ్ బ్రేకర్లలాగా పశు వులు రోడ్డుకు అడ్డంగా పడుకుని వుంటు న్నాయి. వేలకొద్దీ ఆటోలు ఇప్పటికే వుండగా ఇంకా పుట్టుకొస్తూనే వున్నాయి. ఒకప్పుడు రిక్షాలు తిరిగిన రోడ్లలో ఇప్పుడు ఆటోలు, మోటార్‌బైక్‌ల స్థానంలో కార్లు, సైకిళ్ళ స్థానంలో మోటార్‌బైక్‌లు ఇలా వాహనాల సంఖ్య జనాభాతో పోటీ పడుతూ పెరుగుతూపోతోంది. కానీ అవే రోడ్లు, అవే సందులు, అవే గొందులు. రోడ్ల విస్తరణ జరగకపోగా విపరీతంగా దురాక్రమణలకు గురికాబడి రోడ్ల వెడల్పు కూడా తగ్గిపోయింది. ట్రాఫిక్ నియం త్రణలో పోలీస్‌శాఖ పూర్తిగా చేతులెత్తే సింది. కొత్తగా అభివృద్ధి చెందుతున్న మినీబైపాస్ వంటి రోడ్లలో కూడా ఆక్రమ ణలను మునిసిపల్ శాఖ అదుపు చేయ లేకపోతోంది. లంచాల ముసుగులో మునిగిపోయి తమ పైఅధికారులన్నా, రాజకీయనేతలన్నా లెఖ్ఖలేనితనంతో తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్న విభాగం టౌన్‌ప్లానింగ్ విభాగం. వీరికి అస్సలు భయమే లేదు. ప్రజలంటే గౌరవం అసలే లేదు. తమ జేబునిండితే చాలు.

ఐలాండ్లపైన, గోడలపైన విచ్చల విడిగా వేస్తున్న వాల్‌పోస్టర్ల నియంత్రణ అనేకసార్లు వీరి దృష్టికి తెచ్చినా వీరిలో చలనమేలేదు. నెల్లూరు నెక్స్ట్ సమావేశంలో సాక్షాత్తూ కేంద్ర, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల సమక్షంలో జిల్లా యంత్రాంగం మొత్తం హాజరయిన తరుణంలో ప్రముఖ నేపథ్యగాయకులు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఈ విషయమై తీవ్రంగా విమర్శించారు. అయినా ఈ అధికార యంత్రాంగంలో చలనం లేదు, మార్పు రాలేదు. ఇక రోడ్లపైన మూత్ర విసర్జన, బహిరంగా ధూమపానం, అపార్ట్ మెంట్ల చుట్టూ వున్న ఖాళీ స్థలాల్లో తమ ఇంట్లో నుండి చెత్త విసిరి పారేయడం... వీటన్నిటినీ నివారించే ప్రయత్నం ఎవ్వరూ చేయకపోవడం, ఎందుకిలా జరుగు తోంది.... ఈ నగరానికి ఏమయింది...?

> **ఎ.వి.కృష్ణారెడ్డి వంటి మేధావులు ఎన్నో సందర్భాల్లో "సుందర సింహపురి" ప్రణాళికలని అధికారుల దృష్టికి తెచ్చినా అవన్నీ బుట్టదాఖలైయ్యాయే తప్ప ఎక్కడా అమలుకు నోచుకోలేదు.**

> **ఒకప్పుడు రిక్షాలు తిరిగిన రోడ్లలో ఇప్పుడు ఆటోలు, మోటార్‌బైక్‌ల స్థానంలో కార్లు, సైకిళ్ళ స్థానంలో మోటార్‌బైక్‌లు ఇలా వాహనాల సంఖ్య జనాభాతో పోటీపడుతూ పెరుగుతూపోతోంది.**

## కనికరం లేదా... కక్ష సాధింపా...?

2014 ఎన్నికలు జరిగే వరకూ నెల్లూరులో ఏదో ఒక చోట అభివృద్ధి జరుగుతూనే కనపడింది. ఎన్నో సందర్భాల్లో సుందర సింహపురి చూడబోతున్నామన్న ఆశ నగరవాసులలో కనపడింది. కానీ, 2014 ఎన్నికల తర్వాత నగర ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. జిల్లా మొత్తం నిర్లక్ష్యానికి గురికాబడింది. ముఖ్యంగా నగర పరిస్థితి దయనీయంగా మారింది. కేంద్రంలో వెంకయ్యనాయుడు పట్టణాభివృద్ధి శాఖకు నియమింపబడగానే నగరవాసుల ఆశలు చిగురించాయి. రాష్ట్రంలో నారాయణ మున్సిపల్ శాఖ మంత్రి అయ్యాడని వినగానే ఆ ఆశలకు రెక్కలొచ్చి ఆకాశానికి ఎగిరాయి. అయితే ప్రస్తుత పరిస్థితి అలా లేదు. ఇక రాష్ట్రంలోనే నెల్లూరు నెంబర్ 1గా నిలువబోతోందన్న నెల్లూరీయుల కలలన్నీ నీరుగారిపోయాయి. నెల్లూరు నెక్స్ట్ పేరుతో వెంకయ్యనాయుడి కుమార్తె దీపమ్మ చేస్తున్న ప్రయత్నాలకు అధికార యంత్రాంగం సహకరిస్తున్నట్లు నటిస్తున్నారు తప్ప ఆచరించడం లేదు. ఇటీవల జరిగిన 4వ విడత సమావేశంలో మధ్యాహ్నం నుండి కలెక్టర్ గారి అధ్యక్షతన జరిగిన సమీక్షలో మున్సిపల్ కమిషనర్ పాల్గొనకుండా వెళ్లిపోవడమే ఇందుకు నిదర్శనం. ముఖ్యంగా మున్సిపల్‌శాఖ అధికారులెవ్వరికీ తమ పైఅధికారులన్నా, రాజకీయ నేతలన్నా అసలు లెఖ్ఖే లేదు, గౌరవం అంతకన్నా లేదు. వీళ్ళ నిర్లక్ష్యాలకు సాక్ష్యాలుగా ఎన్నో దృశ్యాలు మనకు నగరంలో దర్శనమిస్తాయి. చక్రధర్‌బాబు వంటి ఐఏఎస్ అధికారి నేతృత్వంలో నన్నా ఈ నగర రూపం మారు తుందనుకున్న తరుణంలో పూర్తిగా నగరం గురించి తెలుసుకునేలోగానే బదిలీ వేటుతో ఆయనని తరిమేశారు. ఇక నారాయణ... ఈయన రాత్రిళ్ళు తప్పితే పగలు రాడు. ఈయనకి జనం ఫోబియా... జనం అంటే అసలు పడదు. అందుకే పగలు రాడు. దెయ్యాలు తిరిగే వేళల్లో రాత్రిళ్లు సంచరిస్తుంటాడు. అప్పుడెప్పుడో విడుదలైన "నైట్‌మేర్ ఆన్ ఎల్మ్ స్ట్రీట్" అన్న ఆంగ్ల సినిమా పేరు గుర్తుకు వచ్చేలా "నైట్ మినిష్టర్ ఆన్ నెల్లూర్ స్ట్రీట్స్"లా రాత్రిళ్ళు సంచరించి వెళ్లిపోతుంటాడు. 2014లో నెల్లూరుజిల్లాలో ముఖ్యంగా నెల్లూరు నగరం మరియు రూరల్‌లో తెలుగుదేశం, బీజేపీలకు ఘోరపరాభవం జరగడమే ఈ నిర్లక్ష్యానికి ప్రధాన కారణమన్నది నెల్లూరీయుల ఏకాభిప్రాయం. మనల్ని నిరాకరించిన చోట వారి అభిమానాన్ని ఎలా పొందాలో చూడాలి తప్ప, ఇలా విరుద్ధంగా ప్రవర్తించి ప్రజలకు నరకం చూపించడమేమిటో పాలకులకే అర్థం కావాలి. స్మార్ట్ సిటి చేయనవసరం లేదు, ఈ నగరాన్ని వరస్ట్‌సిటీగా మార్చకుంటే చాలన్నది మేధావుల విన్నపం. అయితే ఇప్పటికే నెల్లూరు వరస్ట్ సిటీగా మారిపోయిందన్నది కాదనలేని సత్యం.

ఇక ఈ నగరాన్ని ఏ రూపంలో ఏ వ్యక్తి కాపాడతాడో ఆ పైవాడికే తెలియాలి. నెల్లూరు పేరును "సింహపురి"గా మార్చాలని ఆలోచిస్తున్న నాయకులు ముందుగా సుందరపురిగా చేయడానికి అవసరమైన చర్యలు చేపడితే ప్రజలు హర్షిస్తారు.

**స్టూడెంట్ బస్**

విద్యార్థుల కోసం నెల్లూరు ఆర్టీసీ–2 డిపో వాళ్ళు ప్రత్యేకబస్సును నడుపు తున్నారు. ఈ బస్సు ఉదయం 6.30గంటలకు నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ నుండి బయల్దేరి 7.30గంటలకు అల్లూరుకు చేరుకుంటుంది. 7.30 గంటలకు అల్లూరు నుండి బయలుదేరి నెల్లూరుకు చేరుకుంటుంది. సాయంత్రం 5గంటలకు నెల్లూరు నుండి అల్లూరుకు బయల్దేరుతుంది. నెల్లూరు– అల్లూరు మార్గంలో గ్రామాల విద్యార్థులు ఈ బస్సును సద్వినియోగం చేసుకోవచ్చు.

# అవగాహన సదస్సు



రామకృష్ణ సేవాసమితి సన్నివేశానంద మహరాజ్ చే విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు నెల్లూరులోని నేతాజీ ఫైలట్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో తల్లిదండ్రులపై భక్తిభావం, నైతిక విలువలు పెంపొందించుట, మత సామరస్యం, సేవాగుణం వంటి విషయాలపై సందేశం ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం ఎంతో అవసరమని, చిన్నతనం నుండి ఉత్తమ అభిరుచులను, లక్షణాలను అలవర్చుకోవడం వల్ల మంచి పౌరులుగా ఎదగగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, వేదవతి సుబ్బారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వాణి, ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న, ఆనీగ్రేస్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో వైద్యఖర్చులు పెంచాలి



నెల్లూరుజిల్లాలో ఉండే ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలకు వైద్యఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని పెంచాలని కోరుతూ వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.మదన్‌కుమార్‌రెడ్డి నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఎస్సీ వసతిగృహాలు 118 ఉండగా వాటిలో 12వేల మంది విద్యార్థులు, ఎస్టీ వసతిగృహాలు 23 ఉండగా, వాటిలో 2200మంది విద్యార్థులు వసతి పొందు తున్నారన్నారు. వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వైద్యఖర్చుల నిమిత్తం సంవత్సరానికి రూ.150/–లు మాత్రమే చెల్లిస్తున్నారని, ఇది చాలా దారుణమన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి వైద్యసేవలకు గాను రూ.500లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శులు హరికృష్ణారెడ్డి, తరుణ్, సాత్విక్, ఈశ్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 19న వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం

నెల్లూరు మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురునిలయంలో వేంచేసియున్న శ్రీ వెంకయ్యస్వామి వారి 33వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మాకాని వెంకట్రావు తెలిపారు. 18వ తేదీ ఉదయం 8గంటలకు శ్రీ స్వామివారి నామ సంకీర్తనతో భిక్షా టనా కార్యక్రమం శ్రీ స్వామివారి ఊరేగింపుతో పురవీధులలో ప్రారంభమవుతుందని, సాయంత్రం 6గంటలకు భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. 19వ తేదీ ఉదయం 6గంటలకు శ్రీ స్వామివారికి అభిషేకం, పూజలు, హోమం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం అన్నదానం, సాయంత్రం చిన్నారులచే కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు, అనంతరం సబ్‌కామాలిక్ ఏక్ హై నృత్య రూపకం జరుగుతాయన్నారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## బంగారం, వెండితో సూక్ష్మ వినాయకుడు




నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ గతంలో ఎన్నో సూక్ష్మకళారూపాలను రూపొందించి అందరి మన్ననలందు కున్న విషయం విధితమే. ప్రస్తుతం వినాయకచవితి సందర్భంగా 100 మి.గ్రా బంగారంతో వినాయకుని ప్రతిమ, 4గ్రాముల వెండిని ఉపయో గించి తోరణం, ఉట్టి మహోత్సవం, ఆంధ్రప్రదేశ్ చిత్రపటం, మన రాజధాని 'అమరావతి అధినాయక వినాయక' అనే పదాలను సూక్ష్మ నమూనాను తయారుచేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ముసవ్వీర్ మాట్లాడుతూ వినాయకచవితి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. దీని ఎత్తు 3సెం.మీ, వెడల్పు 8సెం.మీలని, తయారు చేయడానికి 3రోజులు సమయం పట్టిందని తెలిపారు.

# రాష్ట్ర స్థాయిలో కిషోర్స్ రత్నం నమూనాలు



నెల్లూరుజిల్లా విద్యాశాఖ వారు ఈ నెల 12 నుండి 14వ తేదీ వరకు నెల్లూరు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో నిర్వహించిన 'ఇన్‌స్పైర్' వైజ్ఞానిక ప్రదర్శనలో డాక్టర్ సి.వి.రామన్ స్కూల్ విద్యార్థులు ఎ.దీక్షిత ప్రదర్శించిన రీప్లాంటేషన్ నమూనా, జి.ఉజ్వల ప్రదర్శించిన వేస్ట్ మేనేజ్‌మెంట్ నమూనా, డాక్టర్ కిషోర్స్ రత్నం ఫ్యూచర్ విజన్ స్కూల్ విద్యార్థులు పావని కృష్ణప్రియ ప్రదర్శించిన యకో-ఫ్రెండ్లీ హౌస్ నమూనా, బి.మౌనిక ప్రదర్శించిన ఉప్పునీటి నుండి విద్యుత్ తయారీ నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. నెల్లూరు డివిజన్ నుండి 45 వైజ్ఞానిక నమూనాలు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా అందులో 4 నమూనాలు డా॥ కిషోర్స్ రత్నం స్కూలు విద్యార్థులవి కావడం వారి సృజనాత్మకత, వాక్‌చాతుర్యానికి నిదర్శనం. వీరు జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి చేతులమీదుగా అవార్డులు, సర్టిఫికేట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం ఎంతో అభినందనీయమని, వీరు ప్రాజెక్టులు ఎంచుకొని వాటిని చక్కగా ప్రదర్శించి, వాటి ఉపయోగాలు, ఆవశ్యకతను అందరినీ ఆకట్టుకునేలా వివరించడం హర్షణీయమన్నారు. ఈ నెల 21, 22, 23తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహం అందించిన గైడ్ టీచర్స్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ బి.సుప్రియారెడ్డి(సి.వి.రామన్), కళ్యాణి(ఫ్యూచర్‌విజన్), మేనేజర్లు కమల్‌సింగ్, రాధా కృష్ణ, గైడ్ టీచర్స్ కామాక్షిబాయ్, స్నేహలత, కోటేశ్వరరావు, తన్వీర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

• అక్టోబర్ 3న

# సాంబమూర్తి విగ్రహావిష్కరణ

• స్వచ్ఛభారత్ అవగాహనా ర్యాలీ

• పాల్గొననున్న సినీ రాజకీయ ప్రముఖులు



త్యాగరాజ భిక్షువు, సుప్రసిద్ధ సినీ గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం తండ్రి శ్రీ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి కాంశ్య విగ్రహ ఆవిష్కరణ అక్టోబర్ 3వ తేదీ జరగబోతోంది.

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ కస్తూర్భా కళాక్షేత్రంలో ఘంటశాల వెంకటేశ్వరరావు విగ్రహం ప్రక్కన సాంబమూర్తి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీ తన తండ్రి విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులో స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీని కూడా ఏర్పాటు చేసి స్వచ్ఛభారత్ ప్రచారకర్తగా ప్రభుత్వం తనపై వుంచిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించాలనే లక్ష్యంతో తన స్వంతగడ్డ నెల్లూరు నుండే శ్రీకారం చుట్టబోతున్నాడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం.

3వ తేదీ శనివారం మధ్యాహ్నం 4గంటల నుండి రాత్రి 9గంటల వరకూ జరిగే వివిధ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను త్వరలోనే నెల్లూరీయులకు తెలియజేస్తామని సాంబమూర్తి విగ్రహ కమిటి ఉపాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదీ శనివారం నెల్లూరుకు విచ్చేసిన యస్.పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాట్లను పర్యవేక్షించి, 3వ తేదీ జరుపతలపెట్టనున్న "స్వచ్ఛభారత్" ర్యాలీ మరియు విగ్రహావిష్కరణ కార్యక్రమ విశేషాలను నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి, ఎస్పీ శ్రీ గజరావు భూపాల్‌లను కలసి చర్చించారు. దాదాపు 15వేల మందికిపైగా పాల్గొనేలా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినట్లు కూడా కమిటి సభ్యులు తెలిపారు. బాలు వెంట సినీ గేయ రచయిత వెన్నెలకంటి, బాలు బాల్య మిత్రుడు సుబ్బారావు, వీరిశెట్టి హజరత్ బాబు, బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, డి.హేమంత్‌కుమార్, విగ్రహ నిర్మాణ పర్యవేక్షక ఇంజనీర్ తాటి చలపతిరావ్, మైథిలి మనోహర్‌రెడ్డిలతో పాటు కమిటి ముఖ్యసమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి కూడా వున్నారు.

# నెల్లూరుకు చంద్రబాబు

'రైతు కోసం చంద్రన్న' యాత్రలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 23వ తేదీన నెల్లూరొస్తున్నారు. ఆరోజు మధ్యాహ్నం ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో దీనికి సంబంధించి బహిరంగ సభను, భారీ కార్యక్రమాలను చేపట్టనున్నారు. అన్ని నియోజకవర్గాల నుండి కూడా భారీగా సభకు రైతులను తరలించాలని నిర్ణయించారు. ఈ సభ ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శిద్ధా రాఘవరావుకు అప్పగించారు.


# ఉత్తరక్రియలు



మంచితనం, మానవత్వం కలబోసిన
మనసున్న మనిషి, మాకు మార్గదర్శకులు

## శ్రీ పొలిచర్ల చంద్రశేఖర్‌రెడ్డి గారు

తే. 09.09.2015ది బుధవారం స్వర్గస్థులైనారు.
వారి ఆత్మకు శాంతిని చేకూర్చమని భగవంతుని ప్రార్థిస్తూ...



భార్య : శ్రీమతి సునందనమ్మ

కుమార్తెలు - అల్లుళ్ళు

ప్రతిమ - మొగిలి సోమశేఖర్‌రెడ్డి
జ్యోతి - సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
శాసనమండలి సభ్యులు, మాజీమంత్రివర్యులు
మమత - దువ్వూరు శివకుమార్‌రెడ్డి
సుచరిత - నాగారెడ్డి వెంకటసుధాకర్‌రెడ్డి

మరియు మనుమలు మనుమరాండ్రు

ఉత్తరక్రియలు: తే.23.09.2015ది బుధవారం అల్లీపురంలోని శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గారి స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com